జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 5 సంచిక - 19 | పక్షపత్రిక | అక్టోబర్ 1-15, 2014



## జయకు జైలు

### ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు




## రోదసిలో రారాజులం



You must be the
CHANGE you want to see in the world.

M K Gandhi



బాపూ
నీ బాటను
నడిచే
బలమివ్వు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక అక్టోబర్ 1-15 2014

సంపుటి - 5 సంచిక - 19

## లోపలి పేజీల్లో...

భాగస్వామ్యంతోనే భారత్ అమెరికాలకు విజయాలు...... 6
రాష్ట్రాల్లో రాజనీతిజ్ఞులు........................................ 8
అధికారం - అక్రమార్జనల విషవలయాన్ని ఛేదించడం ఎలా........ 11
అక్రమాస్తుల కేసులో జయలలితకు జైలు......................... 14
18 ఏళ్ళపాటు సాగిన కేసు విచారణ.............................. 16
214 బొగ్గు క్షేత్రాల కేటాయింపులు రద్దు ......................... 18
సంబరాలకు దూరమైన చంద్రబాబు పాలన .................. 20
రూసా నిధులను వినియోగించుకోని రెండు రాష్ట్రాలు......23
కాగితాలపైనే మరుగుదొడ్లు........................................ 24
ఆధార్‌తో అక్రమాలకు అడ్డుకట్ట.................................. 25
బోగస్‌ల వేట............................................................ 26
విడిపోయి సమైక్యం.. ఏపీ, తెలంగాణ యుగళగీతం....... 27
కాగితపు బతుకమ్మ.................................................. 28
వంటగ్యాస్, కిరోసిన్‌లతో నగదు మొదలు...................... 29
మాండలిన్ మాంత్రికుడు శ్రీనివాస్ కన్నుమూత.............. 30
అరుణ గ్రహానికి తొలిప్రయోగం భారత్ ఘనవిజయం...... 31

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**డి.వి.వి.యస్. వర్మ**
సంపాదకులు

**సంపాదక వర్గం**
పి. రవిమారుత్
బండారు రామ్మోహన్‌రావు
ఓంకార్
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# ఈ పక్షం చాట్ మసాలా

1. రైతులకు సాధికారిక విముక్తి

   రుణమాఫీ పోయినా... బాండ్ల మేళాకు భలే బాకా హెడ్డింగ్

2. చౌకధర దుకాణాల్లో ఉచితంగా ఉప్పు

   చౌకబారు పథకం - భారం తక్కువ రుచి ఎక్కువ

3. డ్వాక్రా మహిళలకు ఐ పాడ్ లు

   ఇంట్లో పరిశ్రమ... ఇంటర్‌నెట్ అమ్మకాలు

   **ఇంక రుణ మాఫీ దేనికి**

4. ఆధార్ వుంటేనే పెన్షన్

   ఏ ఆధారం లేకనే గదా పెన్షన్

5. సరికొత్త రాజధాని నిర్మిస్తాం - బాబు

   ఏది నిర్మించినా సరికొత్తదే కదా

6. రూపాయికే ఇడ్లీ సాంబారు - మంత్రి నారాయణ

   విద్యా వ్యాపారం కన్నా ఇడ్లీ వ్యాపారం మిన్న చేస్తారా !

7. ప్రజల్ని మోసగించడం బాబు సహజ గుణం - మాజీ మంత్రి కన్నా

   ఒకరు మోసగించి గెలిస్తే - మరొకరు మోసం చేసి ఓడారు

8. ఆరోగ్య శ్రీకి రాజీవ్‌గాంధీ పేరు తొలగించడం సరికాదు - అంబటి రాంబాబు

   ముందు ఆ పేరు పెట్టడం తప్పు - తొలగించి తమ నేత పేరు పెట్టుకోవడం మరీ తప్పు

9. ఎఫ్.డి.ఐలను ఆహ్వానిస్తే రైల్వేలను స్తంభింపజేస్తాం - యూనియన్ నేతలు

   తోక తలను ఆడించడం అంటే ఇదే

10. మహిళలకు 5 లక్షల దీపం కనెక్షన్లు - మంత్రి సునీత

    సిలిండర్ల ధరలు తగ్గించే వాగ్దానం అమలు చెయ్యండి, తర్వాత కనెక్షన్లు

❖ ❖ ❖

# కార్టూన్ కార్నర్




**OK. You are not corrupt. But then how do you feed your family, pay for child's schooling, transport, dress.....?**

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.


**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

ఫోన్ : **040-23310288**
ఫోన్ / ఫ్యాక్స్ : **040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com


## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311817**

విడి ప్రతి : రు. *10* ,
ఏడాది చందా : రు. *200*
మూడేళ్ళ చందా : రు. *500*

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# స్వచ్ఛ భారత్‌లో భాగంగా అవినీతి ప్రక్షాళన

## సంపాదకీయం

తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు నాలుగేళ్ల జైలు శిక్ష పడింది. 66 కోట్లు అవినీతి కేసులో 100 కోట్ల జరిమానా కూడా పడింది. గత సంవత్సరం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పర్యవసానంగా ఆమె శాసనసభ సభ్యత్వం కోల్పోయింది. ముఖ్యమంత్రిగా రాజీనామా చెయ్యక తప్పలేదు. పైగా మరో ఆరు సంవత్సరాలపాటు పోటీకి అనర్హురాలైంది. ఈ తీర్పు మన రాజకీయ పాలనా వ్యవస్థలకు కనువిప్పు కావాలి.

ఈ తీర్పు తర్వాత కూడా దొరికితే దొంగలు లేకపోతే దొరలు గానే చెలామణీ అయ్యే స్థితిలో పెద్దగా మార్పు లేదు. ఆదాయానికి మించిన ఆస్తులున్న రాజకీయ నేతలను, ఉన్నతాధికారులను బోనుకెక్కిస్తే ఇప్పడున్న జైళ్లు చాలవు. ప్రస్తుతానికి అవినీతిపరులకు అలాంటి భయాందోళనలు కలిగించే పరిస్థితి రాలేదు.

కోర్టులు చొరవ తీసుకున్న చోట మాత్రమే కేసులు నడుస్తున్నాయి. లేకపోతే దొరలుగానే అక్రమార్కులు వుండిపోతున్నారు. అవినీతి ప్రక్షాళనను కోర్టులకు వదిలేస్తే అవి కొందరిని శిక్షించగలవు కానీ మొత్తం వ్యవస్థను అవినీతి నుండి ప్రక్షాళన చెయ్యజాలవు. దీనిపై చొరవ తీసుకోవలసింది రాజకీయరంగం. ప్రజలు వారికి అధికారం ఇచ్చింది సుపరిపాలన అందించడం కోసం. కంచే చేను మేసినట్లు ఈ రాజకీయరంగమే అవినీతిమయం అయింది. ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టడం తర్వాత కోట్లు దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నది. అందుచేత మన పాలక పార్టీలు, కాబోయే పాలకపార్టీలు అవినీతి మీద యుద్ధం ప్రకటిస్తాయని ఆశించలేం.

జాతీయ స్థాయిలో గత మూడు, నాలుగు సంవత్సరాలుగా అవినీతి కుంభకోణాలు వెల్లువెత్తాయి. ఇక చాలా రాష్ట్రాలలో పరిస్థితి చెప్పనక్కరలేదు. ఎవరో ఒకరు చొరవ తీసుకుని తెగించి కేసులు పెట్టడం, సాక్ష్యాధారాలు సేకరించడం, లేదా కోర్టులు చొరవ చూపడంతో విచారణలు సాగడంగానే అవినీతి వ్యతిరేక పోరాటం పరిమితం అయిపోతున్నది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్‌ను ఒక ప్రజా ఉద్యమంగా నిర్వహిస్తామని ప్రకటించింది. స్వచ్ఛ భారత్‌పై మోదీ చేస్తున్న ప్రకటనలు కేవలం పౌరజీవనంలో పరిశుభ్రతకే పరిమితంగా వున్నాయి. మన గ్రామాలు, మన పట్టణాలు, మన నదులు ఇవన్నీ పరిశుభ్రంగా వుండడం అవసరమే దానికి మోదీ చీపురుపట్టడం సముచితమే. కాని దీనితోనే స్వచ్ఛ భారత్ సాకారం కాదు. ఈ పౌరజీవనం చుట్టూ అవినీతి తాండవిస్తున్నది. దానిని కూడా క్షాళన చెయ్యకుండా స్వచ్ఛ భారత్ పరిపూర్ణం కాదు.

అనేక రంగాలలో చకచకా నిర్ణయాలు చేసుకుంటూ పోతున్న ప్రభుత్వం లోక్‌పాల్‌లో నత్తనడక చూపిస్తున్నది. రాష్ట్రాలలో లోకాయుక్తల పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. ఒక్క కర్నాటకలో తప్ప ప్రముఖుల్ని శిక్షించిన లోకాయుక్త ఒక్కటీ లేదు. రాజకీయంగా అధికార దుర్వినియోగంతో కాంట్రాక్టులు, పథకాల పేరుతో కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాను దోచుకుంటున్నారు. ప్రకృతి వనరుల్ని, భూముల్ని కబ్జా చేస్తున్నారు. కొన్ని నెలల్లోనే ఆదాయానికి మించిన ఆస్తులతో కుబేరులవుతున్నారు.

ఈ పరిస్థితులలో అవినీతిపై పోరాటం వ్యక్తులు, కోర్టులు చేసే పోరాటం కాకూడదు. ప్రజా ఉద్యమంగా సాగిస్తామన్న స్వచ్ఛ భారత్ ఉద్యమంలో అది భాగం కావాలి. స్వచ్ఛ భారత్‌లో పాల్గొనేవారంతా పౌరజీవనంలో స్వచ్ఛతతోపాటు రాజకీయ, పాలనారంగాలలో స్వచ్ఛత కోసం పోరాడడానికి దానినే వేదిక చేసుకోవాలి. అలాంటి ప్రజా ఉద్యమం ద్వారానే అవినీతి ప్రక్షాళనకు తగిన వ్యవస్థలు రూపుదిద్దుకుని 21వ శతాబ్దాన్ని మన శతాబ్దం చేస్తాయి.



# భాగస్వామ్యంతోనే భారత్ అమెరికాలకు విజయాలు

**భారత్, అమెరికాలు పరస్పర విజయాన్ని కాంక్షిస్తున్నాయి. మన మధ్య భాగస్వామ్యం అవసరం, అనివార్యం కూడా. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో శాంతి, భద్రత, సుస్థిరతలను కాపాడటంలో దీనిదే కీలకమైన పాత్ర కాబోతోంది.**

**– నరేంద్ర మోడీ,** (వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు రాసిన వ్యాసంలో)

ఎన్నికలకు ముందు సుడిగాలి ప్రచారంతో దేశ ప్రజానీకం మనసు చూరగొన్న ప్రధాని నరేంద్రమోడీ.. ప్రధాని పగ్గాలు స్వీకరిస్తూనే పొరుగు దేశాల వైపు, ప్రపంచం వైపు దృష్టి సారించారు. మోడీ ప్రభుత్వం పట్టుమని వంద రోజులు కూడా పూర్తిచేసుకోక మునుపే అంతర్జాతీయ మీడియా ఆయన అనుసరించబోతున్న విదేశాంగ విధానం ఏమిటన్న దానిపై చర్చలు ఆరంభించింది. ప్రమాణ స్వీకారానికే సార్క్ నేతలను రప్పించటం, మూడు నెలల్లోనే పొరుగు దేశాలను చుట్టబెట్టి కొత్త ఉత్సాహాన్ని నింపటం ద్వారా ఆయన అందరి దృష్టినీ ఆకట్టుకున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నెహ్రూ చూపిన బాటను దాటి ఎటూ ఎదగలేకపోతున్న మన విదేశాంగ విధానానికి తాను కొత్త రూపు ఇవ్వటం ఖాయమని ఇంటాబయటా కూడా నమ్మకం కలిగించగలిగారు. భారత పర్యటనకు వచ్చిన చైనా అధ్యక్షుడిని అడుగడుగునా ఎంతో ఆదరంగా చూసుకుంటూనే చెప్పాల్సిన విషయాలను కుండబద్దలు కొట్టటం ద్వారా తన వ్యూహ చతురతను నిరూపించుకున్నారు. ఇవన్నీ కూడా మోడీ తాజా అమెరికా పర్యటనపై అంచనాలు విపరీతంగా పెంచాయని చెప్పక తప్పదు. ఎందుకంటే చైనా విస్తరణ ఆర్థికంగా, రాజకీయంగా అనూహ్య తీరాలకు చేరుతున్న నేపథ్యంలో ఆసియాలో.. భారత్ ఒక ప్రబల శక్తిగా ఎదగటం చాలా అవసరమని అమెరికా ఆకాంక్షిస్తోంది. అందుకు తగిన యోధుడిని మోడీలో చూస్తుండటం విశేషంగా చెప్పుకోవాల్సిన అంశం. మోడీ పర్యటనను అమెరికా అత్యంత కీలకంగా భావిస్తుండటం వెనక ఈ భౌగోళిక రాజకీయాల ప్రభావం చాలా ఎక్కువగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పుడు భారత్‌కు అమెరికా ఎంత ముఖ్యమో.. అమెరికాకు



భారత్ కూడా అంతే కీలకమన్నది చాలమంది విశ్లేషకుల భావన. అంతర్జాతీయ యవనిక మీద అమెరికా, రష్యా, చైనాల ప్రాబల్యాలను అనూహ్యంగా మార్చివేయగల వ్యూహాత్మక శక్తి నేడు భారత్‌కు ఉందని వీరు విశ్లేషిస్తున్నారు.

### చైనాకు చెక్ పెట్టాలంటే!

ఆర్థికంగా చైనా నుంచి త్వరలోనే తమకు గట్టి సవాళ్లు తప్పవని అమెరికా అభిప్రాయపడుతోంది. ఆయుధ, సైనిక సంపత్తి విషయంలో మాత్రం ఆ దేశం తమ స్థాయిని అందుకోవటానికి దశాబ్దాలు పట్టొచ్చన్న విషయం అమెరికాకు తెలుసు. ఈ నేపథ్యంలో తన సైనిక సామర్థ్యాన్ని ఆసరాగా చేసుకుని చైనాకు చెక్ పెట్టాలనీ, అందుకు ఆసియా పసిఫిక్ ప్రాంతంలో భారత్, జపాన్, ఆస్ట్రేలియాలతో ఒక బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకోవటం అవసరమని అమెరికా భావిస్తోంది. ఈ మూడూ సముద్ర తలంపై గట్టి పట్టున్న దేశాలే అయినా మళ్లీ వీటిలో భారత్ మరింత వ్యూహాత్మక స్థానంలో ఉంది. అందుకే భారత్‌తో భాగస్వామ్యానికి అమెరికా సమధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం అమెరికాకు ఐరోపా దేశాల

నుంచి ఒకప్పుడు ఉన్నంత మద్దతు లభించటం లేదు. ఈ స్థితిలో ఒకవేళ రష్యా, చైనాలు మరింత దగ్గరైతే.. ఆ కూటమిని ఎదుర్కొనేందుకు భారత్, జపాన్, ఆస్ట్రేలియాల భాగస్వామ్యం అక్కరకొస్తుందని అమెరికా భావిస్తోంది.



## మారుతున్న ఆర్థిక శక్తులు

అంతర్జాతీయంగా ఆర్థిక శక్తిగా ఎదగటం, ప్రాబల్యాన్ని పెంచుకోవటమన్నది చారిత్రకంగా మారిపోతూ వస్తోంది. 70ల వరకూ కూడా అమెరికా అనూహ్యమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని ఒక రకంగా శాసించిందనే చెప్పొచ్చు. ఆ తర్వాత జపాన్, దక్షిణ కొరియాలు వరసగా సత్తా చాటుకున్నాయి. 90ల నుంచీ కూడా చైనా ప్రభంజనం ఆరంభమైంది. అనితర సాధ్యమైన ఉత్పాదనా సామర్థ్యంతో చైనా నానాటికీ ఆర్థికంగా మరింత బలపడుతుండటమే కాదు.. అమెరికాను సవాల్ చేసే స్థితికి కూడా చేరింది. ఈ స్థితిలో చైనా ఇంకా వృద్ధిపథంలోనే కొనసాగాలంటే అంతర్గత సుస్థిరత చాలా అవసరం. అందుకే అమెరికా ఆసియా-పసిఫిక్ పరిణామాలపై ప్రత్యేకమైన ఆసక్తిని ప్రదర్శిస్తోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో చైనాకు సవాల్ విసిరే సత్తా ఒక్క భారత్‌కే ఉందని అంతర్జాతీయ సమాజం గట్టిగా నమ్ముతోంది. సాంకేతిక సామర్థ్యంలో ముందుండటం, ఉత్పాదకత పెంచుకునేందుకు అవసరమైన యువ జనాభా ఎక్కువగా ఉండటం, మధ్యతరగతి విస్తరిస్తుండటం.. ఇవన్నీ భారత్ ఆర్థిక పథంలో దూసుకుపోయేందుకు సానుకూలాంశాలు. ఈ నేపథ్యంలో సహజంగానే అమెరికా భారత్ పట్ల ప్రత్యేక ఆసక్తి ప్రదర్శిస్తోంది.అందుకు తగ్గట్టుగా ప్రధాని నరేంద్ర మోడీ కూడా.. భారత సాంస్కృతిక ఔన్నత్యాన్నీ, ఒకప్పటి నాగరకతా ప్రాభవాన్నీ పునరుద్ధరించటమే తన ధ్యేయమని మొదటి నుంచీ చెబుతున్నారు. అంతర్జాతీయ సమాజం ఆసియాను, అందులోనూ భారత్‌ను ఒక కీలక శక్తిగా గుర్తించేలా చెయ్యాలన్న ఆకాంక్ష ఆయన ప్రతి కదలికలోనూ ప్రత్యేకంగా కనబడుతోంది. దేశం ఆర్థికంగా సుస్థిరత సాధించాలంటే ఇరుగుపొరుగులతో చక్కటి సంబంధాలు, ముఖ్యంగా సరిహద్దుల వద్ద శాంతి చాలా అవసరం. దీన్ని బలంగా నమ్ముతున్న మోడీ.. అధికారాన్ని చేపట్టిన దగ్గరి నుంచీ పాకిస్థాన్, నేపాల్, చైనా, భూటాన్ వంటి దేశాల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఈ దేశాలతో ఆర్థిక, వాణిజ్య బంధాలను బలోపేతం చేసేందుకూ కృషి చేస్తున్నారు.

### పొరుగు పర్యటనల్లో మోడీ ముద్ర

జూన్ 16-17: భూటాన్

జులై 13-16: బ్రెజిల్ (బ్రిక్స్ సదస్సు కోసం)

ఆగస్టు 3-4: నేపాల్

ఆగస్టు 30: జపాన్

సెప్టెంబరు 27: అమెరికా

మనం ఆర్థికంగా బలపడటం, సమర్థమైన విదేశాంగ విధానాన్ని అనుసరించటం.. ఈ రెండూ ఒకదానితో ఒకటి ముడిపడిన అంశాలని ఇటీవలి కాలంలో మోడీ తరచుగా వ్యాఖ్యానిస్తుండటం ఆయన వ్యూహ మేమిటో చెప్పకనే చెబుతోంది. విదేశాంగ విధానాల్లో ఇటీవలి కాలంలో "జియోఎకనామిక్స్" అనేది ప్రముఖంగా వినవస్తున్న పేరు. దీన్నే కొందరు "నియో మర్కంటైలిజం" అనీ అంటున్నారు. మోడీ వ్యూహంలో దీని ఛాయ స్పష్టంగా కనబడుతోంది. తన వాణిజ్య విధానాలతో గుజరాత్ ముఖ్యమంత్రిగానే నరేంద్ర మోడీ ఆసియా దేశాలను బాగా ఆకర్షించగలిగారు. ఈ నేపథ్యంలో ఆసియాలో భారత్‌ను ఒక బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు ఆయన ముందుగా వాణిజ్య రంగాన్నే ఆసరాగా చేసుకుంటారని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రాంతీయంగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకునేందుకు మోడీ అమెరికా సహకారాన్ని తప్పక తీసుకుంటారనీ, రక్షణ రంగంలో బయటి నుంచి పెట్టుబడులకు తలుపులు బార్లా తెరవటం ఇందులో భాగమేననీ వీరు వ్యాఖ్యానిస్తున్నారు. అమెరికాతో వాణిజ్య బంధాలను బలోపేతం చేసేందుకు జరుగుతున్న కృషి అంతా.. భవిష్యత్ భాగస్వామ్యానికి బలమైన పునాదిగా ఉపయోగపడుతుందన్నది వీరి విశ్లేషణ. ■

# రాష్ట్రాల్లో రాజనీతిజ్ఞులు

- రామచంద్ర గుహ

ఢిల్లీలో అసాధారణ ప్రజాకర్షణ గల ప్రధానమంత్రి ఉండడం కాదు ముఖ్యం. రాష్ట్రాలలో పాలనాదక్షులైన ముఖ్యమంత్రులు ఉండడమే చాలా ముఖ్యం. పది లేదా పన్నెండు మంది సమర్థులైన ముఖ్యమంత్రులు మనకు ఎంతైనా అవసరం. అప్పుడే భారత్‌కు, భారతీయులకు ఇతోధిక మేలు జరుగుతుంది.

ప్రధానమంత్రిగా మన్మోహన్ సింగ్ లోపాలను 2011 వేసవిలో ప్రజ్వరిల్లిన అవినీతి వ్యతిరేక ఉద్యమాలు క్రూరంగా బహిర్గతం చేసాయి. ఆయన్ని తొలగించేంత కఠిన వైఖరిని సోనియా గాంధీ తీసుకోలేదు. దరిమిలా మన్మోహన్ దాదాపు మూడు సంవత్సరాల పాటు, 16వ లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసేంత వరకు ప్రధానిగా కొనసాగారు. అయితే, అప్పటికే మన్మోహన్ తరువాత ఎవరు ప్రధాని అవుతారు, ఎవ్వరు అవ్వాలి అనే విషయమ్మై చర్చ ప్రారంభమయింది.

2012, 2013 సంవత్సరాలలో నేను ముంబై, కోల్‌కతా, అహ్మదాబాద్, కోచి మొదలైన నగరాలను సందర్శించాను. దేశ రాజకీయాలపై ఎన్నో సంభాషణలు, చర్చల్లో పాల్గొన్నాను ఇంచుమించు ప్రతి సంభాషణా, ప్రతి చర్చ కూడా "నరేంద్ర మోదీయా? రాహుల్ గాంధీయా?" అన్న ప్రశ్నపైనే జరిగింది. మన్మోహన్ అంతకంతకూ బలహీనపడుతుండడం, దేశ ఆర్థిక వ్యవస్థ మరింతగా దిగజారి పోతుండడంతో హతాశులైన మధ్యతరగతి భారతీయులు మన్మోహన్ ఎప్పుడు నిష్క్రమిస్తారా అని ఎదురుచూడసాగారు. యువకుడు, క్రియాశీలుడైన ప్రధానమంత్రి వస్తే ఆర్థిక వ్యవస్థ సత్వరమే సమస్యల నుంచి గట్టెక్కుతుందని, కనీసం అవినీతిని అదుపు చేయడం జరుగుతుందనేది వారి ఆశాభావం.

ఈ సంభాషణల, చర్చల ఒక విశేషమేమిటంటే అవన్నీ జాతీయ అంశాలపైనే జరిగాయి. కోచిలో కేరళ వ్యవహారాల గురించి గానీ, ముంబైలో మహారాష్ట్ర రాజకీయాలపై గానీ ఎవరూ నన్ను అడగలేద్మ్ము నేనూ ఎవర్నీ ప్రశ్నించలేదు. భారత్ 29 రాష్ట్రాల సమాఖ్య. వాటిలో చాలా రాష్ట్రాలు భౌగోళిక వైశాల్యం దృష్ట్యా గానీ, జనాభాపరంగా గానీ ఒక ప్రధాన యూరోపియన్ దేశమంత ఉంటాయి. అయినప్పటికీ 2012లోనూ, 2013లోనూ నేను సందర్శించిన నగరాలన్నిటిలోనూ ప్రజల చర్చ పూర్తిగా ఢిల్లీ కేంద్రిత రాజకీయాల గురించే సుమా!


నంబూద్రిపాద్


కామరాజ్


డా॥ పర్మార్

మోదీ, రాహుల్‌లలో ఎవరిని ప్రధానిగా ఇష్టపడతారని నన్ను ప్రశ్నించగా ఆ ఇరువురిలో ఏ ఒక్కరి వైపు మొగ్గడానికి నేను నిరాకరించాను. మోదీ వ్యవహార శైలీ, ఆయన మతతత్వ గతమూ నాకు ఏమాత్రం నచ్చని విషయాలు. రాహుల్ విషయానికి వస్తే ఆయన బద్ధకస్తుడుగాను, బాధ్యతలను మోయడానికి సుముఖంగా లేనివాడుగాను కన్పిస్తున్నాడు. సరే, కాంగ్రెస్‌లో కుటుంబ ఆధిపత్య సంస్కృతి నాకు బాగా చికాకు కల్గించే విషయం. అసలు జాతీయ రాజధానిలో ప్రజాకర్షణ గలిగిన ఒక నాయకుడు కంటే రాష్ట్రాల్లో పాలనాదక్షులైన పలువురు ముఖ్యమంత్రులు ఉండడం భారత్‌కు అవసరమని నేను గట్టిగా భావిస్తున్నాను. అందుకే ప్రధాని అభ్యర్థిగా ఒక నిర్దిష్ట వ్యక్తిని

ఎంచుకోవడానికి నేను నిరాకరించాను. విద్య, శాంతి భద్రతలు, ఆరోగ్యం మొదలైనవన్నీ రాష్ట్ర జాబితాలోని అంశాలు. ఆర్థిక సంస్కరణల అనంతరం పెట్టుబడులను ప్రోత్సహించడం, ఉపాధికల్పన మొదలైన విషయాల్లో కేంద్రం కంటే రాష్ట్రాలకే ఎక్కువ బాధ్యత ఉంది. కనుక న్యూఢిల్లీలో కంటే రాష్ట్రాలలోనే సమర్థనాయకత్వం మరింత అవసరమనేది నిస్సందేహం.

రాజకీయ విశ్లేషణకు ఈ సమాఖ్య దృక్పథాన్ని అనుసరిస్తూ, స్వాతంత్ర్యం లభించిన నాటినుంచి భారతదేశపు అత్యుత్తమ ముఖ్యమంత్రుల జాబితా నొకదాన్ని ఈ కాలమ్‌లో ప్రతిపాదిస్తున్నాను. క్రమబద్ధమైన పరిశోధన ప్రాతిపదికన కాకుండా, నాలుగు దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా నేను జరిపిన పర్యటనలు, ఆయా ప్రాంతాల వారితో సమాలోచనల ఫలితంగా నాలో ఏర్పడిన అభిప్రాయాల ఆధారంగానే ఈ జాబితాను నివేదిస్తున్నాను. ఆర్థిక సూచీలతో పాటు సామాజిక సూచీలనూ పరిగణనలోకి తీసుకొని ''అభివృద్ధి''ని విశాల దృష్టితో చూసినప్పుడు కేరళ, తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్‌లను బహుశా అత్యంత ప్రగతిశీల రాష్ట్రాలుగా చెప్పవచ్చు. ఈ రాష్ట్రాలలో పురోగతికి నిర్దిష్ట ముఖ్యమంత్రులను ఏ మేరకు కారకులుగా చెప్పవచ్చు?

ఇరవయ్యో శతాబ్ది ఆరంభంలో కేరళలో, దేశంలో మరెక్కడా లేని విధంగా సామాజిక అంతరాలు తీవ్రంగా ఉండేవి. భూ యాజమాన్యం కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమై వుండేది. కుల వివక్ష ఇప్పుడు ఊహించలేని స్థాయిలో ఉండేది. కొన్ని కులాలు కేవలం ''అంటరానివి'' మాత్రమే కాదు, "చూడకూడనివి" కూడా. సదరు కులస్తుల దృష్టి సోకితే తాము మలినమైపోతామని అగ్రవర్ణాల వారు భావించేవారు. ఈ అసమానతలను నిర్మూలించి మానవీయ సమాజ నిర్మాణానికి మహోన్నత సంస్కర్త నారాయణ గురు నాయకత్వంలో జరిగిన సామాజిక ఉద్యమాలు, వామపక్ష రాజకీయాలు విశేషంగా తోడ్పడ్డాయి. ఈ ఉద్యమాలు, ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన నాయకులపై అనేక బాధ్యతలను మోపాయి. విద్యావంతులు, చైతన్యశీలురైన ప్రజలు తమ నాయకుల చర్యలను నిశితంగా గమనించేవారు.

కేరళ ముఖ్యమంత్రులలో అత్యుత్తములు బహుశా ఈఎమ్ఎస్ నంబూద్రిపాద్, సి. అచ్యుత మీనన్‌లను చెప్పవచ్చు. నంబూద్రిపాద్ తన ఆస్తినంతటినీ త్యజించి చాలా నిష్ఠగా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. పరిపాలనా వ్యవస్థ వికేంద్రీకరణను ఆయన బాగా ప్రోత్సహించారు. అచ్యుత మీనన్ కూడా కమ్యూనిస్టే. సీపీఐ నాయకుడు. 1969–75 సంవత్సరాల మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న అచ్యుత మీనన్, నంబూద్రిపాద్ వలే నిజాయితీపరుడు, సమర్థుడైన పాలనాదక్షుడు. మీనన్ హయాంలో భూసంస్కరణలను సమగ్రంగా అమలుపరిచారు. నాణ్యమైన సామాజిక శాస్త్రపరిశోధనలను పరిపాలనా వ్యవహారాలతో మిళితం చేసిన ప్రప్రథమ ముఖ్యమంత్రి అచ్యుత మీననే. ఆయన సూచన మేరకే ప్రముఖ ఆర్థికవేత్త కె.ఎన్.రాజ్ %ఎఎ%సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ స్టడీస్%%ను నెలకొల్పారు.

కేరళ రాజకీయాలలో సామ్యవాద భావజాలం కుల, వర్గ అంత రాలు తగ్గిపోవడానికి దోహదం చేసింది. అయితే అదే భావజాలం నవకల్పనా ప్రతిభను, వ్యవస్థాపనా సామర్థ్యాన్ని కుంటుపరిచింది. జనాభాలో నూటికి నూరుశాతం విద్యావంతులు ఉన్న రాష్ట్రం అత్యాధునిక సాంకేతికతలైన ఐటీ, బీటీ రంగాలలో అగ్రగామిగా ఉండాలి. అయితే వర్తమాన కేరళ ఆర్థిక వ్యవస్థ రాష్ట్రంలో అభివృద్ధి చెందిన పరిశ్రమలపైన గాక ప్రేషక ధనం (విదేశాలలో ఉన్న రాష్ట్ర ప్రజలు పంపే డబ్బు)పై ఆధారపడి వుంది. తమిళనాడు మరింత విజయవంతంగా సామాజిక పురోగతిని, ఆర్థిక క్రియాశీలతతో మిళితం చేసింది. ఈ రాష్ట్రంలో రాజకీయాలు, పాలనావ్యవస్థలో బ్రాహ్మణుల ఆధిపత్యం సుదీర్ఘకాలం కొనసాగింది. పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకత్వంలోని ద్రావిడ ఉద్యమం, కొంతవరకు కామరాజ్‌నాడార్ (కాంగ్రెస్‌లోనే గాక దేశంలోనే ప్రప్రథమ బీసీ ముఖ్యమంత్రి) రాజకీయ చాతుర్యం, పాలనా దక్షతలు బ్రాహ్మణుల గుత్తాధిపత్యాన్ని బద్దలుకొట్టాయి. 1954 నుంచి 1963 వరకు ముఖ్యమంత్రిగా ఉన్న కామరాజ్ సమర్థమైన, స్వచ్ఛమైన పాలనఅందించారు. మధ్యాహ్న భోజన పథకంను తొలుత ఆయనే ప్రవేశపెట్టారు.

1967లో డీఎంకే అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీకి చెందిన తొలి, మలి ముఖ్యమంత్రులు సి.ఎన్. అన్నాదురై, ఎమ్. కరుణానిధి సంక్షేమ రాజ్య విధానాలను అనుసరించారు. మహిళా సాధికారతను ప్రోత్సహించారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు (కరుణానిధి నాయకత్వంలోనివి కూడా) అవినీతికి పేరుపడినప్పటికీ ప్రజా సేవల రంగం ప్రశంసనీయగా ఉన్నది. ప్రభుత్వ పాఠశాలల, ప్రభుత్వాసుపత్రుల నిర్వహణ మరే రాష్ట్రంలో కంటే అత్యుత్తమంగా ఉండేది. అలాగే రవాణాసంస్థల,

విద్యుత్ కంపెనీల సేవలు అత్యుత్తమమైనవిగా ఉండేవి.

తమిళనాడు ముఖ్యమంత్రులు ప్రైవేట్ పెట్టుబడులను బాగా ప్రోత్సహించారు. కర్ణాటకలో బెంగళూరు ఒక్కటే ప్రధాన వ్యాపార కేంద్రం కాగా తమిళనాడులో చెన్నైతో పాటు సేలం, కోయంబత్తూరు, మధురైలు కూడా పారిశ్రామిక కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. చాలా రాష్ట్రాలలో కంటే తమిళనాడులో ప్రాంతీయ అంతరాలు చాలా తక్కువ.

కేరళ, తమిళనాడులు రెండూ సముద్ర తీర రాష్ట్రాలు. ఈ రెండు రాష్ట్రాలూ శక్తిమంతమైన సామాజిక రాజకీయ ఉద్యమాలకు నెలవులు. వివిధ రంగాల్లో వాటి పనితీరు మెరుగ్గా ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు. మరి అభివృద్ధి సాధనలో హిమాచల ్ప్రదేశ్‌కూ ప్రశస్తమైన చరిత్ర ఉన్నది. పర్వతప్రాంతమైన ఈ హిమాచల్ పూర్తిగా భూపరివేష్టిత రాష్ట్రం. అక్కడి రాజపుట్ సంస్కృతి ప్రగతిశీలమైనది కాదు. స్వాతంత్ర్యోద్యమంలో ఈ ప్రాంతం అంత చురుగ్గా పాల్గనలేదు. అయినప్పటికీ మహిళా అక్షరాస్యత, ఆరోగ్య భద్రత, ఆర్థికాభివృద్ధి మొదలైన రంగాలలో హిమాచల్ ఇటీవల సంవత్సరాలలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాలలో ఒకటిగా ఉన్నది. ఈ ఘనతకు తొలి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. పర్మార్ అందించిన సేవలే ముఖ్య కారణమని ఆ రాష్ట్ర ప్రజలతో జరిపిన సంభాషణల ద్వారా నాకు అర్థమయింది. హిమాచల్ కేంద్ర పాలిత ప్రాంతంగా ఉన్నప్పుడు పర్మార్ దాని పాలనావ్యవస్థకు సారథ్యం వహించారు. 1971లో హిమాచల్‌కు రాష్ట్ర ప్రతిపత్తి లభించిన తరువాత కూడా ఆయన చాలా సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా ఉన్నారు. విద్వజ్ఞుడైన పర్మార్ విద్యారంగానికి, గ్రామీణ రోడ్లకు అత్యధిక ప్రాధాన్యమిచ్చారు. గ్రామాల నుంచి పట్టణాలకు రవాణా సదుపాయాలు మెరుగుపడడంతో పండ్లతోటల సేద్యం బాగా అభివృద్ధి చెందింది. చిన్న కమతాల రైతులు కూడా బాగా లబ్ధిపొందారు.

ఇతర రాష్ట్రాలకు చెందిన మరికొంత మంది ముఖ్యమంత్రులను కూడా తప్పక చెప్పుకోవల్సివున్నది. మహారాష్ట్రలో వై.బి.చవాన్, వసంతరావు నాయక్‌లను ప్రముఖంగా చెప్పుకోవాలి. చవాన్ సహకార సంఘాలకు వ్యవసాయ రంగానికి ప్రాధాన్యమివ్వగా నాయక్ భారతదేశపు తొలి ఉపాధి హామీ పథకాన్ని అమలుపరిచారు. కర్ణాటకలో దేవరాజ్ అర్స్, రామకృష్ణ హెగ్డేలు ప్రజల స్మృతిలో నిలిచి పోయారు. అర్స్ భూ సంస్కరణలను అమలుపరచగా, హెగ్డే పంచాయతీరాజ్‌కు ప్రాధాన్యమిచ్చారు.

గత దశాబ్దంలో ఉత్తమ ముఖ్యమంత్రి ఎవరు? సార్వత్రిక ఎన్నికల ప్రచారం సందర్భంగా గుజరాత్‌లో నరేంద్ర మోదీ సాధించిన విజయాలను ఘనంగా చాటిచెప్పారు. నిజానికి ఆయన సమకాలికులైన నితీశ్‌కుమార్ (బీహార్), శివరాజ్ సింగ్ (మధ్యప్రదేశ్)లు ప్రశస్తమైన ఫలితాలను సాధించారు. అలాగే త్రిపురలో మాణిక్ సర్కార్ కూడా.



**మాణిక్ సర్కార్**



**శివరాజ్ సింగ్ చౌహాన్**

వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల గురించిన ఈ అంచనా ప్రభావాత్మకమైనదే గానీ, క్రమబద్ధమైన పరిశోధన ప్రాతిపదికన చేసింది కాదని నేను మొదటే చెప్పాను. వివిధ రాష్ట్రాలు సాధించిన అభివృద్ధి, అందులో ముఖ్యమంత్రులు వహించిన పాత్ర గురించి చరిత్రకారులు, రాజనీతి శాస్త్రవేత్తలు సమగ్రంగా రాయవలసి వున్నది. అయితే నేను నా ప్రధాన వాదనకు కట్టుబడి వున్నాను. ఢిల్లీ తమకు ఏదో చేస్తుందని ఎదురుచూడక మీడియా, పౌరులు తమ సొంత రాష్ట్రాలలోని రాజకీయవేత్తల పనితీరును నిశితంగా గమనిస్తుండాలి. ఢిల్లీలో అసాధారణ ప్రజాకర్షణ గల ప్రధానమంత్రి ఉండడం కాదు ముఖ్యం. రాష్ట్రాలలో పాలనాదక్షులైన ముఖ్యమంత్రులు ఉండడమే చాలా ముఖ్యం. పది లేదా పన్నెండు మంది సమర్థులైన ముఖ్యమంత్రులు మనకు ఎంతైనా అవసరం. అప్పుడే భారత్‌కు, భారతీయులకు ఇతోధిక మేలు జరుగుతుంది. ■

# అధికారం - అక్రమార్జనల విష‌వలయాన్ని ఛేదించడం ఎలా?

ఆగస్టు 12, 2002

- డా॥ జయప్రకాష్ నారాయణ్

మన రాజకీయంలో నిరంతరం ఏదో ఒక వివాదం లేదా సంక్షోభం చోటు చేసుకోవలసిందే. ఒక వారం తహల్కాటేపుల ఉదంతం. మరో వారం గుజరాత్ మత కల్లోలాలు. ఇంకో వారం గుజరాత్ అసెంబ్లీ రద్దు. మధ్యలో రాష్ట్రపతి ఎంపిక వివాదం. ఇటీవల పనికి ఆహారం పథకంలో అవకతవకలు. ప్రస్తుతం పెట్రోలు డీలర్ల నియామకంలో ఆశ్రిత పక్షపాతం, అవినీతి ప్రజల దృష్టిని ఆకట్టుకుంటున్నాయి.



## వ్యర్థ చర్చలు

ప్రజాస్వామ్యంలో ఇలాంటి కుంభకోణాలు బయటపడటం వ్యవస్థ ఆరోగ్యానికి మంచిది. తిరుగులేని అధికారం చలాయిస్తున్న ప్రభుత్వ పాలనలో కుంభకోణాలు బయటపడనంత మాత్రాన అవినీతి లేదనుకోవటం పొరపాటు. అవినీతిని దాచిపెట్టడడంలో పాలకులు సిద్ధహస్తులని రుజువవుతోంది. వారానికో అవినీతి భాగోతాన్ని బయటపెట్టి, రాజకీయాన్ని, పాలకులను, న్యాయమూర్తులను నిందించి, ఇక మన బాధ్యత తీరిందన్నట్లు చేతులు దులుపుకోవటం అవివేకం. ఇలాంటి సంస్థాగత అవినీతి వెనక ఉన్న మౌలిక కారణాలపైన దృష్టి సారించకుండా కేవలం విమర్శలతోనే తృప్తి పడితే ప్రయోజనం లేకపోగా నిరాశ కలుగుతుంది. మనదేశంలో ఇలాంటివి బయటపడ్డప్పుడు వాటిని కేవలం రాజకీయ ప్రయోజనాలకోసం, ప్రత్యర్థులను ఇరుకున పెట్టడం కోసం, వారిమీద బురద చల్లడంకోసం మాత్రమే వినియోగించటం అనవాయితీ అయింది. సత్యాసత్యాలు అప్రస్తుతాలయి పోయాయి. అధికార క్రీడలో ఇలాంటివన్నీ వ్యూహాత్మక అంశాలుగా ఉపయోగపడుతున్నాయి. కాని, వ్యవస్థలో అవినీతిని అంతం చేయటానికి చేపట్టవలసిన సంస్థాగత ఏర్పాట్లపైన శ్రద్ధ లేకుండా పోయింది. పౌరులు కూడా అవినీతి వార్తలను, పార్లమెంటులో ప్రకంపనల వివరాలను రోజువారీ సంభాషణలలో మళ్ళీమళ్ళీ చెప్పుకొని విమర్శించటం, నిస్పృహను ప్రదర్శించటవేం తప్ప, ఈ పరిస్థితిని అధిగమించటానికి ఏం చేయాలో ఆలోచించటంలేదు.

ఇలా ఊబుసుపోక అనవసర చర్చలే తప్ప, ప్రజల ప్రయోజనాలకు, బహిరంగ చర్చకు మధ్య, సంబంధం లేకుండా పోయింది. ప్రతి దాన్ని అధికార క్రీడలో భాగంగానే తప్ప, మరో విధంగా మనం చూడలేక పోతున్నాం. ఆ కారణంగానే రాజకీయ పార్టీలు, ప్రభుత్వ యంత్రాంగం, పౌరులు అందరం సమస్యలో భాగం అవుతున్నామే తప్ప, పరిష్కారంలో పాలుపంచుకోలేక పోతున్నాం. అందువల్లనే అధికార క్రీడ, ఎన్నికలు కేవలం కొంతమంది స్వలాభం కోసం పనికి వస్తున్నాయి తప్ప, అది దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించడం లేదు. ఎన్నికలు కేవలం మేక పిల్లలను కబళించటానికి ఏ తోడేలుకు హక్కుందో నిర్ణయించే ప్రక్రియగా మారాయి తప్ప, దోపిడీని ఆపటానికి సాధనంగా ఉపకరించటం లేదు. కుంభకోణాలు బయటపడినప్పుడు పార్టీలు ప్రదర్శించే వైఖరి మన పరిస్థితికి అద్దం పడుతోంది. అధికారపక్షం వారి వాదన ఏమంటే మీరు అధికారంలో ఉన్నప్పుడు ఇంతకంటే దారుణాలనే చేశారు. మా తప్పులతో పాటు గతంలో మీరు తప్పుకొని మాకు అధికారాన్ని అప్పగించండి. గతంలో మా తప్పులను బయటపెడితే మాత్రం మేం చూస్తూ ఊరుకోం. అలాగని రాజకీయంలో ఉన్న వాళ్లంతా దొంగలని, వాళ్లు కేవలం ప్రజలను మోసం చేయటంకోసం కంకణం కట్టుకున్నారని భావించటం పొరపాటు. అన్ని పార్టీలలోను ఎందరో నాయకులు

నిజాయతీగా తమ విధుల్ని నిర్వర్తిస్తున్నారు. అయితే ఈ పరిస్థితుల్ని మార్చే శక్తి వారికి లేకుండా పోయింది.

## క్లిష్టమయిన సమస్యలు

పెట్రోలు డీలర్ల నియామకాన్నే పరిశీలిస్తే అధికారంలో ఉన్న పెద్దలు గత 35 ఏళ్లుగా డబ్బులు తీసుకుని నిర్ణయాలు చేస్తున్నారని అందరికీ తెలుసు. కొద్దిమంది అర్హులను నిజాయతీగా నియమించినా, అధిక సంఖ్యాకుల నియామకాలలో పైరవీలు, పలుకుబడులు, లంచాలు విరివిగా చోటుచేసుకుంటున్నాయన్నది నిర్వివాదాంశం. ఈ ఎంపిక కోసం న్యాయమూర్తులను నియమించినా అవినీతి ఆగటంలేదని, అవన్నీ కంటితుడుపు చర్యలేనని, గతంలో కేంద్రమంత్రి సతీష్‌వర్మను సుప్రీంకోర్టు అభిశంసించి. రూ॥50 లక్షలు జరిమానా వేసిందని, చివరికి ఆ కోర్టే ఆ జరిమానాను రద్దు చేసిందని మనందరికీ తెలుసు. డీలర్లు రూ॥15 లక్షల నుండి పాతిక లక్షలదాకా లంచాలిచ్చి సేషన్లు తెచ్చుకొన్నప్పుడు ఇందనంలో కల్తీలు, పెట్రోలు కొలతల్లో మోసాలు తప్పవని అందరికీ తెలుసు. ఆపైన ప్రభుత్వ శాఖల అధికారులు లంచాలు తీసుకుంటున్నారని, ఆ కారణంగా నిజాయతీ పరులయిన డీలర్లు ఎంతో ఇరుకున పడుతున్నారని ప్రజలెరుగుదురు. పెట్రోలు స్టేషన్లలో కొలతల మోసాన్ని అరికట్టేందుకు 1998లో 'లోక్‌సత్తా' ఉద్యమం చేపట్టేంత వరకు జంటనగరాలలో ఉన్న 104 పెట్రోలు బంకులలో కేవలం అరడజను మాత్రమే మీటర్లలో మోసం చేయకుండా వినియోగదార్లకు నిజాయతీగా పంపిణీ చేస్తున్నాయని పేరుంది. మిగిలిన బంకుల వారంతా మోసాలకు పాల్పడుతున్నారన్నది బహిరంగ రహస్యం. చివరికి పరిస్థితి ఎంతదాకా వచ్చిందంటే, కొలతల్లో మోసంచేసిన పంపిణీ చేయకుండా అమ్మినట్లు లెక్కలు చూపించిన మొత్తంపైన కూడా తమకు బేటాలు కావాలని కార్మికులు వాటా అడిగారు. ఓ బంకులో జరిగిన అమ్మకాలనుబట్టి కార్మికులకు కొంతశాతం ఇచ్చే ఆనవాయితీ ఉంది. నిజంగా పోసిన పెట్రోలుకు మాత్రమే ఈ బేటాలిస్తామని యజమానులు; కాదు, అమ్మకం చూపిన మొత్తానికి బేటాలివ్వాలని కార్మికులు వాదించుకున్నారు!

అలాగే.... పనికి ఆహారం పథకంలో అవినీతి చోటుచేసుకుందని తెలియని వాళ్లు లేరు. ఎన్నో నియోజకవర్గాలలో నాయకులు గత అయిదారు నెలలుగా ఈ పథకంలో అవకతవకల ద్వారా కోట్ల రూపాయలు అక్రమంగా వెనకేసుకున్నారని ప్రజలందరికీ తెలుసు. ఎలాగూ కేంద్ర ప్రభుత్వం పంపిన ఆహారధాన్యాలే కాబట్టి " ఈ రూపంలో మనకు కొన్ని వనరులు వస్తాయి, వాటితో పనులు చేస్తే ప్రజల్లో పలుకుబడి వస్తుంది, కొంత డబ్బు 'మన' వాళ్లే తింటే పట్టించుకోనక్కరలేదు" అని ప్రభుత్వ నేతలు భావించవచ్చు. "ఎన్నికలలో కోట్లు ఖర్చుపెట్టి గెలిచాం. తిరిగి సంపాదించకపోతే పెళ్ళాం, బిడ్డలు అన్యాయమైపోతారు. ఎందరో కార్యకర్తలు పార్టీ విజయం కోసం చాలా కష్టపడ్డారు. ఏదో ఒకరూపంలో వాళ్లకు ఆదాయ చూపకపోతే రాజకీయం నడవదు" అని నాయకులు అక్రమాలకు పాల్పడవచ్చు. "దేనికీ నిధులు లేనప్పుడు ఏదో ఒక పేరుతో కొన్ని పనులు, కొంత మేరకయినా జరుగుతున్నాయి. ఈ పథకం కూడా లేకపోతే ఇక అసలు మనకు రోడ్లే రావు. నూటికి 20 రూపాయలు మధ్యలో తిన్నా, కనీసం మిగిలిన పనయినా జరుగుతోంది. అయినా ఇది ప్రభుత్వం డబ్బే కదా" అని ప్రజలు భావించవచ్చు "దొరికిందే ఛాన్సు ఏ పార్టీవాళ్లు వచ్చినా ఎలాగూ వాళ్లు కోట్లు మింగటం ఖాయం. వాళ్లు చెప్పినట్లు చేస్తే మన 10 శాతం వాటా మనకు వస్తుంది. అర్ధాంతరంగా బదిలీలు, వేధింపులు ఉండవు. అందరూ దోచుకుంటూంటే నాకేం పోయింది. ఎదిరిస్తే అన్నీ ఇబ్బందులే. కలిసిపోతే అంతా లాభమే" అని అధికారులు కుమ్మక్కయిపోవచ్చు. ఇలా అందరూ రాజీ పడిపోతున్నారు. చివరికి ఈ వివాదం రాజకీయ రూపు దాలుస్తోందే కాని, ప్రజలకు జరిగే నష్టాన్ని పట్టించుకునేవారు తక్కువ. అలాగే గతంలో సిటీబస్సు పర్మిట్లు పూర్తిగా ప్రభుత్వాధికారుల చేతుల్లో ఉండేవి. జిల్లా కలెక్టర్లు, ఎస్.పి, ప్రాంతీయ రవాణాధికారి కలిసి చేసే ఎంపిక- కాబోయే కోటేశ్వరుణ్ణి నిర్ణయించేది. పలుకుబబడితోనో, సిఫారసుతోనో, లంచంతోనో కొంత మందికి పర్మిట్లు దక్కేవి. ఆ పర్మిట్లకు ఎంతో పోటీ ఉండేది. పెద్ద పెద్ద లాయర్లు తమ క్లయింట్ల తరపున వాదించే వారు. 1987లో రాజీవ్‌గాంధీ ప్రభుత్వం మోటారు వాహనాల చట్టాన్ని మార్చి ఎంతమందికయినా పర్మిట్లు ఇచ్చే ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వాధికారులు పర్మిట్లను నిర్ణయించడంకాక, ఎవరయినా కొన్ని నిబంధనల ప్రకారం బస్సులు నడుపుకొని, పోటీకి తట్టుకుని నిలబడటం ఆ చట్టం లక్ష్యం. 1989లో ఆ చట్టాన్ని మొదటగా తూర్పుగోదావరి జిల్లాలో అమలుచేసి అందరికీ పర్మిట్లనిచ్చినప్పుడు వాహనాల యజమానులు, లాయర్లు- అందరూ నిర్ఘాంతపోయి వ్యతిరేకించారు! పర్మిట్లు పొందినవారు

కూడా, ఎవరో ఒకరికి పర్మిటునివ్వాలని, అందరికీ అవకాశం ఇవ్వరాదని వాదించారు. చివరికి హైకోర్టుకు అప్పీలు చేసుకోగా, అర్హులయిన వారందరికీ పర్మిట్లివ్వటం సబబని, పోటీలో ఎవరు నిలబడితే వారు కొనసాగుతారని, మిగిలిన వారు విరమించుకుంటారని తీర్పు వచ్చింది. పోటీని వ్యతిరేకించే వారు, పైరవీలపైన ఆధారపడేవారు, లంచాలు పుచ్చుకునేవారు ఇలా- ప్రభుత్వ విచక్షణాధికారం కొనసాగుతూనే ఉండాలని ఆశించటం సహజం. ప్రభుత్వానికి ఏ సంబంధమూ ఉండకూడని అంశాలపైన కూడా విచక్షణాధికారాన్ని కొనసాగించటం మనం నిరంతరం చూస్తున్నాం. ఉదాహరణకు లౌకిక రాజ్య వ్యవస్థలో దేవాలయ ట్రస్టు బోర్డుల నియామకంతో ప్రభుత్వానికి ఏ సంబంధమూ ఉండరాదు. అయినా స్థానిక శాసనసభ్యుల నిర్ణయం ప్రకారం ప్రభుత్వం ఈ నియామకాలు చేస్తోంది. అలాగే రైతులు తమ ఉత్పత్తిని అమ్ముకునే మార్కెట్ కమిటీలలో అధ్యక్షులుగా, సభ్యులుగా ప్రభుత్వం 'అస్మదీయులను' తమ ఇచ్ఛానుసారం నియమిస్తోంది. అలా నియమించిన వారిలో కొందరు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నమాట వాస్తవం. కాని ఇలా విచక్షణాధికారం ఉన్నప్పుడు అవినీతి, పైరవీలు జోరుగా కొనసాగటం సహజం. ఎందుకిలా చేస్తున్నారని పాలకులను నిలదీస్తే, "అయ్యా, ఇప్పటికే మా కార్యకర్తలు విసిగిపోయి ఉన్నారు. పల్లకీని మోసే బోయీలు తామయితే, శాసన సభ్యులు, మంత్రులు సౌఖ్యాలను అనుభవిస్తున్నారని విమర్శిస్తున్నారు. వాళ్లకు ఏవో పదవులనిచ్చి సంతృప్తి పరచకపోతే మేం రాజకీయాల్ని నడపలేం" అని సమాధానం వస్తోంది.

### సంస్థాగత పరిష్కారాలు

ఇవనీ అత్యంత క్లిష్టమయిన అంశాలు. వీటికి సంస్థాగత పరిష్కారాలను అన్వేషించకుండా అవినీతిని అరికట్టడం అసాధ్యం. మూడు దిశలలో మనం పరిష్కారాలను వెతకాలి. మొదటిది, ప్రభుత్వానికి ఎంతగా విచక్షణాధికారం ఉంటే, అంతగా అవినీతి, పక్షపాతం చోటుచేసుకుంటాయి. ప్రభుత్వంలో గుత్తాధిపత్యం కొనసాగితే అక్రమాలను అరికట్టలేం. ఆయిల్ కంపెనీలు ప్రభుత్వం చేతుల్లో ఉండాల్సిన అవసరమే లేదు. అయిల్ డీలర్ల నియామకానికి, ప్రభుత్వానికి ఏ సంబంధం ఉండరాదు. ఆ గుత్తాధిపత్యాన్ని, నిర్ణయాధికారాన్ని ప్రభుత్వం చేతుల్లో ఒకసారి పెట్టాక అవినీతి ఉందని వాపోవటంలో అర్థం లేదు. ప్రభుత్వం చేయవలసిన పనులను విస్మరించి, వ్యాపారంలో వేళ్లు పెట్టడం వల్ల కలిగిన అనర్థం ఇది. ఒకప్పుడు- చివరికి సిమెంటు, స్టీలు కొనేందుకు కూడా ప్రభుత్వ పర్మిట్లు కావాల్సి వచ్చేది. ఇలాంటి గుత్తాధిపత్యం, లైసెన్సు- పర్మిట్లు- కోటాల రాజ్యం అవినీతికి పునాది. టెలిఫోన్లు పూర్తిగా ప్రభుత్వం చేతుల్లో ఉన్నప్పుడు డబ్బిచ్చినా టెలిఫోను కావాలంటే సాధ్యమయ్యేది కాదు. ఎందరో లంచాలిచ్చి, సిఫారసులతో పనులు చేయించుకునే వారు. ఎందరో పార్లమెంటు సభ్యులు తమకున్న విచక్షణాధికారంతో ఆశ్రితులకు ఫోను మంజూరు చేయించేవారు. కొందరు ఫోన్ల మంజూరుకు డబ్బు తీసుకునే వారు. ప్రభుత్వాధిపత్యం అంతరించటంతో ఇప్పుడు ఫోన్లు కొద్ది రోజులలోనే ఏర్పాటవుతున్నాయి. ఎవరికీ ఏ లంచమూ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఆ విషయంలో నాయకులకు విచక్షణాధికారం లేదు. ఇక అవినీతిని అంతం చేసే రెండో మార్గం- అధికార వికేంద్రీకరణ అన్ని అధికారాలకు కేంద్రీకరించిన ప్రభుత్వం చేతుల్లో పెట్టకుండా, ఎక్కడికక్కడ నిర్ణయాలు చేసే బాధ్యతను ప్రజలకు అప్పగించాలి. అవినీతి వల్ల తామే నష్టపోతున్నామని, పోయేది మన డబ్బేనని, ఆ డబ్బును సద్వినియోగం చేస్తే అది తమకే మరో రకంగా ఉపయోగపడుతుందని ప్రజలకు అర్థం కావాలి. స్థానిక పాలనవల్ల అన్నీ సక్రమంగా జరుగుతాయని, అందరూ నిజాయతీగా ఉంటారని అనుకోవటం అమాయకత్వం. కాని తాము కట్టే పన్నులకు, తమకు జరిగే పనులకు, అందే సేవలకు మధ్య సంబంధం స్పష్టంగా ఉంటే ప్రజలు జాగరూకతతో అవినీతిని నిరోధిస్తారు. అలాగే అధికారంలో ఉన్నవారుపార్టీ కార్యకర్తలకు విచక్షణాధికారంతో పదవులను కట్టబెట్టటం కన్నా, స్థానికంగా నిజాయతీగా నాయకులు ఎదిగే అవకాశాన్నిస్తే పార్టీల పునాది బలపడుతుంది, నిజాయతీ నిలబడుతుంది. అన్నింటినీ మించి అవినీతి అంతానికి అతి ముఖ్యమార్గం ఎన్నికల సంస్కరణలు.కోట్ల ఖర్చుతో చట్టసభకు ఎన్నికై అక్రమార్జనతో అధికారాన్ని నిలుపుకొనే అవకాశం ఉన్నంత వరకు ఈ విషవలయం కొనసాగుతూనే ఉంటుంది. రాజకీయంలో డబ్బు వినియోగాన్ని క్రమబద్ధీకరించి, చట్టబద్ధమైన ఏర్పాట్లు చేసినప్పుడే నిజాయతీగా ఎన్నికలలో గెలిచే అవకాశం కలుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరూ సమస్య వర్ణననుంచి పరిష్కారం మీదకి దృష్టిని సారించటం అవసరం. ■

* * *

# అక్రమాస్తుల కేసులో జయలలితకు జైలు

- 4 ఏళ్ల కారాగారం, రూ.100 కోట్ల జరిమానా
- బెంగళూరు ప్రత్యేక కోర్టు సంచలన తీర్పు
- ఆదాయానికి మించిన ఆస్తులే కారణం
- మరో ముగ్గురికీ శిక్ష జైలుకు తరలింపు
- తీర్పుతో జయ సీఎం పదవికి ఎసరు
- ఉద్వేగానికి గురైన తమిళనాడు సీఎం



తమిళనాట విప్లవనాయకిగా పేరొందిన జయలలిత అనూహ్య రీతిలో జైలుపాలయ్యారు. 18 ఏళ్లుగా సుదీర్ఘంగా విచారణ సాగిన అక్రమాస్తుల కేసులో తాజా తీర్పు జయ ముఖ్యమంత్రి పదవికే ఎసరుపెట్టింది. పదేళ్లపాటు ఆమెను క్రియాశీల రాజకీయాలకు దూరం చేయనుంది. ఆదాయాన్ని మించిన ఆస్తుల కేసులో తమిళనాడు ముఖ్యమంత్రి జె.జయలలిత(66)కు బెంగళూరు ప్రత్యేక న్యాయస్థానం నాలుగేళ్ల జైలుశిక్ష, రూ.100 కోట్ల జరిమానా విధించింది. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు శశికళ (జయ స్నేహితురాలు), ఇళవరసి (శశికళకు సమీప బంధువు), సుధాకరన్ (శశికళకు మేనల్లుడు, జయకు దత్తపుత్రుడు)లను దోషులుగా తేల్చిన న్యాయస్థానం 4 ఏళ్ల కారాగార శిక్ష, రూ.10 కోట్ల చొప్పున జరిమానా విధించింది. బెంగళూరు శివార్లలోని పరప్పన అగ్రహార కేంద్ర కారాగారం ఎదుట ఉన్న ప్రత్యేక న్యాయస్థానంలో ప్రత్యేక జడ్జి జాన్ మైఖేల్ డికున్హా సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో తీర్పునిచ్చారు. అనంతరం పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. వైద్యపరీక్షల అనంతరం ఆమెను పరప్పన అగ్రహారలోని కేంద్రకారాగారానికి తరలించారు. 7402ను జయకు ఖైదీ నంబర్‌గా కేటాయించారు. భారతీయ శిక్షాస్మృతిలోని నేరపూరిత కుట్ర, అవినీతి నిరోధక చట్టం కింద ఆదాయానికి మించి భారీగా ఆస్తులున్నాయనే ఆరోపణలపై వీరిని దోషులుగా నిర్ధరించారు. బెయిలు దరఖాస్తును కర్ణాటక హైకోర్టు నుంచి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. అయితే.. దసరా నేపథ్యంలో అక్టోబరు 6 వరకూ సెలవులున్నాయి. ప్రాసిక్యూటర్ జి.భవాన్‌సింగ్ న్యాయస్థానం సమీపంలో విలేకరులతో మాట్లాడుతూ "భారతీయ శిక్షాస్మృతి 109, 120(బి), 1988 అవినీతి నిరోధక చట్టం 13(1)(ఇ), 13(2), కింద జయలలితను దోషిగా న్యాయమూర్తి ప్రకటించారు" అని వెల్లడించారు. తీర్పు వెలువరించినప్పుడు న్యాయస్థానంలో జయలలిత, ఇతర నిందితులు హాజరయ్యారు. నలుగురు నిందితులూ బెయిలుకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు.

- జైలుపాలై అనర్హత వల్ల సీఎం పదవిని కోల్పోయే పరిస్థితి ఏర్పడ్డ తొలినేత జయనే కావడం గమనార్హం.
- జయలలిత 1991 నుంచి 1996 వరకూ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రూ.66.65 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులున్నాయనే కేసులో విచారణ చేపట్టిన ప్రత్యేక జడ్జి విధించిన రూ.100 కోట్ల జరిమానా ఏ రాజకీయ నేతపైనా విధించనంత భారీ మొత్తం.
- న్యాయస్థానం వద్ద ఏఐఏడీఎంకే మద్దతుదారులు డీఎంకే నేత కరుణానిధి, సుబ్రమణ్యస్వామిల దిష్టిబొమ్మలు దహనం చేశారు. తీర్పుతో తమిళనాడులో అక్కడక్కడా ఆందోళనలు చెలరేగాయి. ప్రభుత్వవాహనాలపై దాడులు జరిగాయి. దుకాణాలను మూయించారు.
- తీర్పును వాయిదా వేయాలని, మరో న్యాయస్థానంలో తీర్పు ఇవ్వాలని కోరుతూ న్యాయవాది ఒకరు దాఖలు చేసిన

వ్యాజ్యాన్ని అత్యున్నత న్యాయస్థానం శుక్రవారం కొట్టేసిన నేపథ్యంలో తాజా తీర్పు వెలువరించేందుకు మార్గం సుగమమైంది.

**కేసు.. నేపథ్యమిదీ..**

ఆదాయానికి మించి అపారంగా ఆస్తుల్ని సంపాదించినట్లు 1996లో తమిళనాడు నిఘా, అవినీతి నిరోధక శాఖ ఆమెకు వ్యతిరేకంగా చెన్నై ప్రత్యేక న్యాయస్థానంలో కేసును దాఖలు చేసింది. 1991లో ముఖ్యమంత్రిగా బాధ్యతల్ని చేపట్టినపుడు ఆమె ఆస్తి కేవలం రూ.మూడు కోట్లు. వేతనంగా ఒక రూపాయి మాత్రమే తీసుకునేవారు. ఐదేళ్ల వ్యవధిలో 1996కల్లా ఆమె, ఆమెతో బాటు కలసి ఉన్న వారి ఆస్తి రూ.66.65 కోట్లకు ఎలా పెరిగిందనీ, ఎలాంటి వ్యాపార లావాదేవీలు జరుపకుండా అంత ఆస్తిని ఎలా గడించారని ప్రాసిక్యూషన్ ప్రశ్నించింది. భారీగా భూమి, బంగారం, చీరలు ఇతర సంపదను కలిగి ఉన్నారని, దత్త పుత్రుడు సుధాకరన్ వివాహానికి రూ.ఐదు కోట్లు వెచ్చించారనీ ఆరోపించింది. పెళ్లి ఖర్చును పెళ్లి కుమార్తె కుటుంబం భరించిందని జయలలిత అప్పుడు సంజాయిషీ ఇచ్చారు. రాజకీయ కక్షతోనే డీఎంకే తనకు వ్యతిరేకంగా కేసులు దాఖలు చేసిందని ఆరోపించారు. ప్రాసిక్యూషన్ తన పాత ఆస్తుల విలువను తక్కువగా లెక్కించిందనీ, ఇతర వనరుల నుంచి గడించిన ఆదాయాన్ని పరిగణించలేదనీ, ఆస్తి విలువను చాలా చూపారంటూ తన వాదనల్ని సమర్థించుకున్నారు.

■ జయలలిత అధికారాన్ని తిరిగి చేపట్టిన తర్వాత 2003లో కేసు విచారణ బెంగళూరుకు మారింది. ఏఐఏడీఎంకే పాలనలో తమిళనాడు న్యాయస్థానాల్లో కేసు విచారణ నిష్పక్షపాతంగా సాగబోదని డీఎంకే నాయకుడు అన్బళగన్ వ్యాజ్యం దాఖలు చేయటంతో కేసు బదిలీ జరిగింది. బెంగళూరులో జరిగిన విచారణలో న్యాయమూర్తి అడిగిన 1,300 ప్రశ్నలకు జయలలిత సమాధానాలిచ్చారు.

■ ఈ కేసును ఇంతకుముందు నలుగురు న్యాయమూర్తులు ఎ.ఎస్.పచపురే, ఎ.టి.మునాలి, బి.ఎం.మల్లికార్జునయ్య, ఎం.ఎస్.బాలకృష్ణ విచారించారు. కేసు తీర్పు సమయానికి న్యాయమూర్తిగా జాన్ మైఖేల్.డికున్హా వ్యవహరిస్తున్నారు.

**పదేళ్ల పాటు ఎన్నికలకు దూరం..**

జయలలితకు విధించిన శిక్ష ఖరారైతే ఆమె పదేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండబోదని విశ్రాంత అడ్వకేట్ జనరల్ బి.వి.ఆచార్య వెల్లడించారు. శిక్ష వ్యవధి మూడేళ్ల కంటే ఎక్కువైనందున ఆమె ఐపీసీ 389 కింద శిక్షను సస్పెండ్ చేయాల్సిందిగా ఉన్నత న్యాయస్థానంలో కోరుకోవటం మినహా మరో మార్గం లేదని చెప్పారు. మూడేళ్ల కంటే తక్కువ శిక్ష విధించి ఉంటే దాన్ని ఆ న్యాయమూర్తే సస్పెండ్ చేసి బెయిల్ మంజూరు చేసే అవకాశం ఉండేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ■

# తెలంగాణలో తగ్గుతున్న బాలికలు

## మహిళా భద్రత కమిటీ ఆందోళన

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లోనూ బాలికల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని, బాలురతో పోలిస్తే బాలికల నిష్పత్తిలో భారీగా తగ్గుదల కనపిస్తోందని ప్రభుత్వ మహిళాభద్రత, రక్షణ కమిటీ పేర్కొంది. లింగనిర్ధరణ (పీఎన్‌డీటీ) నిషేధ చట్టం అమలులో వైఫల్యమే ఈ అనర్థానికి కారణమని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో గత దశాబ్దకాలంలో తెలంగాణలో లింగనిష్పత్తిలో తగ్గుదల వివరాలను వెల్లడించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం వరంగల్ జిల్లాలో ప్రతి వేయిమంది బాలురకు గాను 912 మంది బాలికలే ఉన్నారని, 2001తో పోలిస్తే నిష్పత్తి బాగా తగ్గినట్లు చెప్పింది. మిగిలిన తొమ్మిది జిల్లాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉందని పేర్కొంది. బాలికల సంఖ్య మరింత తగ్గకుండా ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకోవాలని సూచించింది. లింగనిర్ధరణ నిషేధ చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని కోరింది. ప్రతి మూడు నెలలకోసారి రాష్ట్రస్థాయి కమిటీ సమావేశం కావాలని, జిల్లా స్థాయిల్లో కలెక్టర్లు తరచూ సమావేశాలు జరపాలని, రేడియాలజిస్టుల వివరాలను సేకరించాలని అభిప్రాయపడింది. అల్ట్రా సౌండ్ కేంద్రాలన్నింటినీ నమోదు చేయాలని, అర్హతల్లేకుండా లింగ నిర్ధరణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిషేధ చట్టంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించింది. గ్రామాల్లో గర్భిణిలు, జననాల నమోదును తప్పనిసరి చేయాలని తెలిపింది

# 18 ఏళ్లపాటు సాగిన కేసు విచారణ

చట్టపరమైన ఎన్నో మలుపులు...పలు రాజకీయ పరిణామాలతో గత 18 ఏళ్ల పాటు సాగిన తమిళనాడు ముఖ్యమంత్రి అక్రమాస్తుల కేసు చివరకు సంచలన తీర్పుతో ఒక కొలిక్కి వచ్చినట్లయింది. ఏఐఏడీఎంకే సారథి అక్రమాస్తుల కేసు 18 ఏళ్ల పాటు కొనసాగిన తీరు ఇలా

**1996 : జూన్, 14 :** జయలలితపై అక్రమాస్తుల కేసు దాఖలు చేసిన నాటి జనతాపార్టీ నేత డాక్టర్.సుబ్రమణ్యం స్వామి. 1991–96 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో జయలలిత తన ఆదాయానికి మించి సుమారు రూ.66.65 కోట్ల అక్రమాస్తులను కూడగట్టుకున్నారన్నది ప్రధాన ఆరోపణ.

**జూన్, 18:** అక్రమాస్తుల ఆరోపణల నేపథ్యంలో జయలలితపై ఎఫ్ఐఆర్ దాఖలుకు డీవీఏసీని ఆదేశించిన నాటి డీఎంకే సర్కారు.

**జూన్, 21:** ఈ కేసుపై దర్యాప్తు జరపాల్సిందిగా ఐపీఎస్ అధికారి లతికా శరన్‌ను ఆదేశించిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ న్యాయమూర్తి.

**డిసెంబరు 7:** జయలలిత అరెస్టు. కొన్ని వారాల అనంతరం ఆమె విడుదల. జయపై అక్రమార్జనకు సంబంధించి వెల్లువెత్తిన ఆరోపణలు.

**1997: జూన్ 4:** అవినీతి నిరోధక చట్టం, 1988 లోని పలు సెక్షన్ల కింద ఛార్జిషీటు దాఖలు. చెన్నైలోని అదనపు సెషన్స్‌కోర్టులో జయలలిత, మరో ముగ్గురిపై అక్రమార్జన ఆరోపణలపై దోషవిచారణ మొదలు.

**అక్టోబరు 1:** అక్రమాస్తుల కేసులో తనను ప్రాసిక్యూట్ చేసేందుకు అప్పటి తమిళనాడు గవర్నరు ఫాతిమా బీవీ ఇచ్చిన అనుమతిని సవాలు చేస్తూ జయ వేసిన పిటిషన్‌తో పాటు, ఇతరపిటిషన్లను డిస్మిస్ చేసిన మద్రాసు హైకోర్టు. విచారణ కొనసాగింపు.

**2000 ఆగస్టు :** ఈ కేసులో పదిమంది మినహా మొత్తం 250 మంది ప్రాసిక్యూషన్ సాక్షుల విచారణ.

**మే, 2001 :** అసెంబ్లీ ఎన్నికలు. ఏఐఏడీఎంకేకు పూర్తి మెజారిటీ. తమిళనాడు ముఖ్యమంత్రి అయిన జయలలిత. ఆమె పదవి చేపట్టడాన్ని సవాలు చేస్తూ పిటిషన్. 2000, అక్టోబరులో తమిళనాడు చిన్నతరహా పరిశ్రమల సంస్థ కేసులో ఆమెపై దోషనిర్ధారణ జరిగిన నేపథ్యంలో అనర్హురాలంటూ వాదన. ముఖ్యమంత్రిగా ఆమె నియామకాన్ని రద్దుచేసిన సుప్రీంకోర్టు.

**21/9: సీఎంగా జయ పదవీచ్యుతి .**

**2002: ఫిబ్రవరి, 21:** అందిపట్టి నియోజక వర్గం నుంచి ఉప ఎన్నికలో జయలలిత విజయం. మళ్లీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం.

**2003: ఫిబ్రవరి, 28 :** జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్న దరిమిలా తమిళనాడులో ఈ కేసు విచారణ సరిగా జరగకపోవచ్చునీ...అందుకే, విచారణను కర్ణాటకకు మార్చాలనీ కోరుతూ సుప్రీకోర్టును ఆశ్రయించిన డీఎంకే ప్రధాన కార్యదర్శి కె.అన్బళగన్.

**నవంబరు, 18 :** జయ కేసును బెంగళూరుకు బదిలీ చేసిన సుప్రీం కోర్టు.

**2005 : ఫిబ్రవరి, 19 :** ప్రాసిక్యూషన్ నిర్వహించేందుకు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఎస్‌పీపీ)గా మాజీ అడ్వొకేట్ జనరల్ బీవీ.ఆచార్యను నియమించిన కర్ణాటక సర్కారు.

**2011:అక్టోబరు/నవంబరు :** ప్రత్యేక కోర్టు ఎదుటవిచారణకు హాజరైన జయ

**2012 ఆగస్టు,12:** ఎస్‌పీపీగా కొనసాగేందుకు అశక్తత వ్యక్తంచేసిన ఆచార్య.

**2013 : జనవరి:** ఆచార్య రాజీనామాను ఆమోదించిన కర్ణాటక సర్కారు. కేసు నుంచి వైదొలగిన ఆచార్య.

**ఫిబ్రవరి, 2:** ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా భవానీసింగ్‌ను నియమించిన కర్ణాటక సర్కారు.

**ఆగస్టు, 26:** అకారణంగా చూపకుండానే భవానీసింగ్ నియామకాన్ని ఉపసంహరిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసిన

కర్ణాటక సర్కారు. అప్పటి కర్ణాటక చీఫ్ జస్టిస్‌ను సంప్రదించకుండానే ఆయన నియామకం ఉపసంహరణ.

**30/9:** భవానీసింగ్ నియామకాన్ని ఉపసంహరించిన కర్ణాటక సర్కారు నోటిఫికేషన్‌ను కొట్టవేసిన సుప్రీం.

**డిసెంబరు, 12 :** 1997లో జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న విలువైన వస్తువులు, ఇతర సంపదను ప్రత్యక్షంగా కోర్టు ముందుంచాలన్న నాటి డీఎంకే ప్రధానకార్యదర్శి అన్బళగన్ అభ్యర్థనకు సుప్రీంకోర్టు అంగీకారం. అనంతరం వాటన్నిటినీ చెన్నైలోని ఆర్‌బీఐ ట్రెజరీలో భద్రపరిచారు.

**2014: ఫిబ్రవరి, 28 :** జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులను కోర్టు ముందు హాజరుపరచాలన్న ఎస్‌పీపీ అభ్యర్థనను తోసిపుచ్చిన ప్రత్యేక కోర్టు. ప్రొసీడింగ్‌లను సాగదీసి...కాలయాపన చేసే ఉద్దేశంతోనే ఎస్‌పీపీ ఇలా చేశారన్న న్యాయమూర్తి.

**మార్చి 18:** మూల్యం విధింపును సవాలు చేస్తూ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించిన భవానీసింగ్.

**మార్చి 21:** ప్రత్యేక కోర్టు నిర్ణయాన్ని సమర్థిస్తూ భవానీ సింగ్ అభ్యర్థనను కొట్టివేసిన హైకోర్టు.

**ఆగస్టు, 28:** ఈ కేసులో తీర్పును సెప్టెంబరు 20న ప్రకటించాలంటూ ప్రత్యేక కోర్టు నిర్ణయం. ఆ రోజున జయలలితతో సహా ఈ కేసులో నిందితులైన అందరూ కోర్టు ఎదుట హాజరుకావాలంటూ ఆదేశం.

**16/9 :** తీర్పు ప్రకటన 27కు వాయిదా.

**27/9 :** జయ దోషిగా ప్రకటన. ■

# ఇప్పుడైనా అడగండి....

తల్లీ ! నీకు సంతోషమేనా
నీ తనయుడు నీతి తప్పడం, లంచగొండిగా మారడం
వాడు నీ కడుపున పుట్టిన చీడ పురుగు కాదా

తండ్రీ ! నీకు సమ్మతమేనా
నీ వారసుడు దారి తప్పడం, దోపిడీ దొంగ కావడం
వాడు నీ వంశ ప్రతిష్టకు భంగకరం కాదా

చెల్లీ ! నీకు ఆనందమేనా
మీ ఆయన మానవతను వీడడం, మనిషిగా దిగజారడం
వాడు నీ మంగళ సూత్రానికి అవమానం కాదా

పిల్లలూ ! మీకు ఆమోదమేనా
మీ తల్లిదండ్రులు లంచాలు మరగడం, వాటితో మీరు పెరగడం
వారు మీ మనుగడకు మాయని మచ్చకాదా

మీలో ఎవరైనా ఎప్పుడైనా అడిగారా వాళ్ళని
నెల నెలా వారికొచ్చే జీతమెంతని, తెచ్చే గీతమెంతని
ఇప్పుడైనా అడగండి మీరు కన్నవాళ్ళను, మీ కన్నవాళ్ళను
తప్పుడు సంపాదనతో లేని గొప్పలకు పోవద్దని
ఎప్పటికీ నీతి నిజాయితీలను వీడవద్దని
అప్పుడే అందరూ ఆదరిస్తారని, ఆశీర్వదిస్తారని... చెప్పండి...

**గద్వాల్ ఈరన్న**
కర్నూలు
**99592 24899**

# 214 బొగ్గు క్షేత్రాల కేటాయింపులు రద్దు

## సుప్రీం సంచలనాత్మక తీర్పు

- కంపెనీలకు భారీ జరిమానా
- గనులు ఖాళీ చేయడానికి ఆరు నెలల గడువు
- పనులు మొదలు పెట్టని సంస్థలు పరిహారం చెల్లించాలి
- 42 క్షేత్రాలు కోల్‌ఇండియా లిమిటెడ్ స్వాధీనంలోకి
- మిగిలిన 172 క్షేత్రాల వేలానికి మార్గం సుగమం



బొగ్గు క్షేత్రాల కేటాయింపులపై సుప్రీంకోర్టు సంచలనాత్మక తీర్పు వెలువరించింది. ఆగస్టు 25న వెలువరించిన తీర్పునకు కొనసాగింపుగా తుది నిర్ణయాన్ని ప్రకటించింది. కార్పొరేట్ రంగం కంగు తినేలా.... 1993 నుంచి 2010 వరకు వివిధ కంపెనీలకు కేటాయించిన మొత్తం 218 క్షేత్రాల్లో 214 క్షేత్రాల కేటాయింపులను రద్దు చేసింది. అక్రమంగా కేటాయింపులు పొందినందుకుగాను ప్రభుత్వానికి వాటిల్లిన నష్టానికి టన్నుకు రూ.295 చొప్పున పరిహారం చెల్లించాలని ఆయా కంపెనీలను ధర్మాసనం ఆదేశించింది. ఈ మొత్తం రూ.7,900 కోట్లని అంచనా. జరిమానా మూడు నెలల్లోగా చెల్లించాలని ఆదేశించింది. ఎన్‌టీపీసీ, సెయిల్‌కు కేటాయించిన ఒక్కో బొగ్గుక్షేత్రాన్ని, అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ పవర్ యాజమాన్యంలోని ససాన్ పవర్‌కు కేటాయించిన మరో రెండు బగ్గు క్షేత్రాల కేటాయింపులకు మాత్రం రద్దు నుంచి మినహాయింపునిచ్చింది. ఇప్పటికే పనులు మొదలు పెట్టిన 42 బొగ్గుక్షేత్రాలను స్వాధీనం చేసుకోవడానికి కేంద్రానికి అనుమతిచ్చింది. మిగిలిన క్షేత్రాల్లో కార్యకలాపాలను నిలిపివేయడానికి ఆయా కంపెనీలకు ప్రధాన న్యాయమూర్తి ఆర్.ఎం.లోధా నేతృత్వంలోని జస్టిస్ మదన్ బి లోకుర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌తో కూడిన ధర్మాసనం ఆరునెలల గడువు మంజూరు చేసింది. ఈ తీర్పు ఫలితంగా మిగిలిన 172 బొగ్గు క్షేత్రాలకు కేంద్రం వేలం వేయడానికి మార్గం సుగమమయింది.

అక్రమ ప్రక్రియ ద్వారా లబ్ధి పొందిన వారు అందుకు తగ్గ శిక్ష అనుభవించాల్సిందేనని సుప్రీంకోర్టు తన 27 పేజీల తీర్పులో స్పష్టం చేసింది. 2012, డిసెంబరు నాటికి 157 క్షేత్రాల్లో రూ.2.87లక్షల కోట్లు, అంతిమ వినియోగ కర్మాగారాల్లో రూ.4లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టినందున, 10లక్షల మంది ఉద్యోగాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున రద్దు చేయవద్దని కంపెనీలు చేసిన విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు రుణం రూపేణా ఇచ్చిన దాదాపు రూ.2.5లక్షల కోట్లు నిరర్థక ఆస్తులుగా మిగిలిపోతాయని కంపెనీలు వాదించాయి. ఎస్‌బీఐ ఒక్కటే రూ.78,263 కోట్లు నష్టపోతుందని పేర్కొన్నాయి. రాయల్టీ, సెస్సు, ప్రత్యక్ష, పరోక్ష పన్నుల రూపేణా రూ.4.4లక్షల కోట్లు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నాయి.

“బొగ్గుక్షేత్రాల కేటాయింపులు అక్రమంగా, ఏకపక్షంగా జరిగిన తీరును మా తీర్పు ఇప్పటికే ఎత్తిచూపింది. కొనసాగింపుగా ఇస్తున్న ఈ తీర్పు.. కేంద్రం చేసిన తప్పును సరిచేయడానికి ఉద్దేశించినది. సహజవనరులు దేశానివి. అవేవో కొందరికి చెందినట్లుగా ప్రభుత్వం వ్యవహరించరాదు.” అని స్పష్టంచేసింది. బొగ్గు క్షేత్రాల రద్దువల్ల తలెత్తే ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు పూర్తిగా సిద్ధమైఉన్నట్లు ఎన్‌డీఏ ప్రభుత్వం వెల్లడించిన వైఖరిని సుప్రీంకోర్టు గమనంలోకి తీసుకుని ఈ తీర్పు వెలువరించింది. 42 బొగ్గు క్షేత్రాల పనులను కోల్ ఇండియా లిమిటెడ్ చేపట్టాలని ఆదేశించింది. 2015, మార్చి 31 నుంచి వాటిని స్వాధీనంలోకి తీసుకోవాలంది.

గతంలో విచారణ జరిగినప్పుడు... కేటాయింపుల రద్దును యూపీఏ ప్రభుత్వం వ్యతిరేకించింది. కేటాయింపులు పూర్తయిన తర్వాత వివిధ కంపెనీలు రూ.2లక్షల కోట్ల పెట్టుబడులు

పెట్టినట్లు వెల్లడించింది. ప్రతి కేటాయింపునూ విడివిడిగా పరిశీలించి సక్రమమో కాదో నిర్ధారించడానికి కమిటీని వేయాలన్న కంపెనీల విజ్ఞప్తి ధర్మాసనం తోసిపుచ్చింది. " ఒక్కరి కేసునూ ఈ తీర్పు విడివిడిగా చూడలేదు. కేటాయింపుల ప్రక్రియను మాత్రమే పరిశీలించింది. కేటాయింపులు అక్రమం, ఏకపక్షం అని తేల్చుకుంది. మళ్లీ ఆ ప్రక్రియను విడివిడిగా కమిటీ ద్వారా పరిశీలించే ప్రసక్తే లేదు. ఇలా చేస్తే తీర్పు ప్రభావం లేకుండా చేసినట్లే." అని తేల్చింది.

**ఆగస్టు 25నే స్పష్టీకరణ :** 1993 నుంచి జరిగిన కేటాయింపులన్నీ అక్రమమని, ఏకపక్షమని సుప్రీంకోర్టు ఆగస్టు 25న స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. వేలం పద్ధతి ప్రవేశపెట్టకముందు 1993 నుంచి 2010 వరకు కేంద్రంలో వివిధ ప్రభుత్వాల హయాంలో కేటాయించిన 218 బొగ్గు క్షేత్రాల కేటాయింపులను కోర్టు పరిశీలించింది. కేటాయింపులకు 36 స్క్రీనింగ్ కమిటీలు అనుసరించిన పద్ధతులను ఆ నాటి తీర్పులో తీవ్రంగా ఆక్షేపించింది. బొగ్గు క్షేత్రాల కేటయింపులన్నింటినీ రద్దు చేయాలని న్యాయవాది ఎం.ఎల్.శర్మ, స్వచ్ఛంద సేవాసంస్థ కామన్‌కాజ్... 2012లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై ఈ విచారణ చేపట్టింది.

### బొగ్గు మసి వెనక కథ ఇదీ

- 2004-09 మధ్య కాలంలో జరిగిన కేటాయింపులు సక్రమంగా లేవని 2012, మార్చిలో కాగ్ ముసాయిదా నివేదిక పేర్కొంది. ఆయా కంపెనీలకు రూ.10.7లక్షల కోట్ల మేర అనుచిత లబ్ధి చేకూరిందని అంచనా వేసింది.
- ఎంపీలు ప్రకాశ్‌జవదేకర్, హంస్‌రాజ్ ఆహిర్ ఫిర్యాదు మేరకు బొగ్గు క్షేత్రాల కేటాయింపులపై సీబీఐ విచారణకు కేంద్ర విజిలెన్స్ కమిషన్ 2012, మే 31న ఆదేశించింది.
- కాగ్ తుది నివేదికను 2012, ఆగస్టులో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ప్రభుత్వానికి వాటిల్లిన నష్టం రూ.1.86లక్షల కోట్లుగా తేల్చింది.
- 194 బొగ్గుక్షేత్రాల కేటాయింపుల రద్దుకు సుప్రీంలో 2012, సెప్టెంబరు 6న ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది.
- 1993-2008 మధ్య బొగ్గు క్షేత్రాలను సక్రమంగా కేటాయించలేదని, ఉత్పత్తి ఇంకా ప్రారంభించని క్షేత్రాల కేటాయింపులు రద్దు చేయాలని స్థాయీసంఘం.. పార్లమెంట్‌కు 2013, ఏప్రిల్ 23న నివేదిక సమర్పించింది.
- దర్యాప్తు నివేదికను న్యాయశాఖ మంత్రి అశ్వనీ కుమార్‌తో పంచుకున్నట్లు సీబీఐ డైరెక్టర్ రంజిత్‌సిన్హా.. 2013, ఏప్రిల్ 26న సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేఏడాది మే 10న మంత్రి రాజీనామా చేశారు.
- బొగ్గు కుంభకోణం సంబంధిత కేసుల విచారణకు సుప్రీంకోర్టు.. 2014, జులైలో ప్రత్యేక కోర్టును ఏర్పాటు చేసింది.
- 1993-2010 మధ్య జరిగిన కేటాయింపులు అక్రమమని 2014, ఆగస్టు 25న సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. 214 క్షేత్రాలను రద్దు చేస్తూ బుధవారం తీర్పు చెప్పింది.

### ప్రజాప్రయోజనాలకు తీవ్ర నష్టం

"1993, జులై 14 నుంచి 36 సార్లు సమావేశమయిన స్క్రీనింగ్ కమిటీ చేసిన సిఫార్సుల మేరకు జరిగిన కేటాయింపులు, ప్రభుత్వం నేరుగా చేసిన కేటాయింపులు ఏకపక్షం. ఎవరిని ఎంపిక చేయాలి? ఎవరిని చేయకూడదు అనే ప్రమాణాలను స్క్రీనింగ్ కమిటీ పాటించలేదు. దరఖాస్తుదారు సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఉక్కు, విద్యుత్తు లేదా సిమెంట్ కర్మాగారాలను నిర్వహిస్తూ ఉత్పత్తి చేస్తున్న కంపెనీలకే బొగ్గు క్షేత్రాలను కేటాయించాల్సి ఉండగా స్క్రీనింగ్ కమిటీలు కేటాయించే సమయానికి అవి ఆ పనిలో లేనే లేవు. తాము ఆ రంగాల్లో ఉత్పత్తులు వెలువరిస్తున్నట్లు దరఖాస్తుల్లోనూ పేర్కొనలేదు. స్క్రీనింగ్ కమిటీ పారదర్శకంగా వ్యవహరించలేదు. కమిటీలు యథాలాపంగా వ్యవహరించాయి. ఫలితంగా జాతీయ సంపద అనుచిత తీరులో పంపిణీ జరిగింది. ప్రజాప్రయోజనాలకు తీవ్రంగా నష్టం వాటిల్లింది."

ఆగస్టు 25 నాటి తీర్పులో సుప్రీంకోర్టు ఆక్షేపణ ■

# సంబరాలకు దూరమైన చంద్రబాబు పాలన

- డి.వి.వి.యస్. వర్మ

వందరోజుల చంద్రబాబు పాలనకు అధికారయుతంగా సంబరాలు లేకపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఎందుకంటే పేనంత పథకానికి ఏనుగంత ప్రచారం ఇవ్వడం ఆయనకు తెలుసు. విజయవాడ, గుంటూరు మధ్య ప్రజావేదిక మీద ప్రమాణస్వీకారం చెయ్యడం, జాతీయ నాయకులను వేదిక ఎక్కించడం, 25-30 కోట్ల రూపాయల ఖర్చుతో అంగరంగ వైభవంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించి, అక్కడే తొలి 5 సంతకాలు చేసి ఇది పనిచేసే ప్రభుత్వంగా విస్తారమైన ప్రచారం పొందారు.

రుణమాఫీలపై తొలిసంతకం చేసినా విధి విధానాలు పేరుతో ఒక కమిటీని వేశారు. రిజర్వుబ్యాంకుకు, కేంద్ర ప్రభుత్వానికి వినతులు చేశారు. దీనిపై ఎలాంటి స్పష్టత రాకుండానే ''రైతులు రుణమాఫీ ఉత్సవాలను'' నియోజకవర్గాలలో నిర్వహింపజేశారు. జిల్లాల పర్యటనలు, డ్వాక్రా మహిళల సమావేశాలతో ప్రతి సమస్యకూ తానే పరిష్కర్తగా ప్రకటించుకుంటున్నారు. ఇలా ప్రచార ఆర్భాటాలతో ప్రారంభించిన చంద్రబాబు తన 100 రోజుల పాలనను ఉత్సవంగా నిర్వహించడంలో ఎందుకు వెనుకంజ వేశారన్నదే అసలు సమస్య.

కేవలం మూడు నెలల పాలన ఆధారంగా ఒక ప్రభుత్వ పాలన మీద తీర్పు చెప్పడం సబబు కాదు. కాని ఒక ప్రభుత్వం ఏ దిశగా ప్రయాణిస్తుందో తెలుసుకోడానికి మాత్రం ఉపకరిస్తుంది.

విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి అందరికీ తెలిసిందే. శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ దానికి అద్దం పట్టింది. లక్షా పదకొండువేల కోట్ల బడ్జెట్‌లో ప్రణాళికేతర వ్యయం 85 వేల కోట్లు వుంటే ప్రణాళికా వ్యయం కేవలం 26 వేల కోట్లుగా వుంది. ఇంతటి శిరోభారం వున్న బడ్జెట్ గతంలో ఎన్నడూ లేదు. పైగా మొత్తంమీద రెవెన్యూ లోటు 25 వేల కోట్లుగానూ, ద్రవ్యలోటు 38 వేల కోట్లుగానూ పేర్కొన్నారు. కేంద్రం నుండి ఆశిస్తున్న 15 వేల కోట్లు వస్తే ఆ మేరకు ఈ భారాలు తగ్గుతాయి. ఒకపక్క ఆర్థిక పరిస్థితి ఇలా వుంటే ఎన్నికల్లో గెలవడానికి అన్ని సంప్రదాయ పార్టీలు అలవిమాలిన వాగ్దానాలు చేశాయి. ఇందులోనూ



చంద్రబాబుదే పై చేయిగా వుంది. ఎన్నికల్లో విజయాలు సాధించటానికి ఈ ప్రలోభ పథకాలు ఎంతవరకు ఉపయోగపడ్డాయో తెలియదు కాని అధికారం లోకి వచ్చాక అవే ఆ పార్టీలకి ఉరితాళ్లు అవుతాయని ఇప్పటికైనా అందరికీ స్పష్టంగా అర్థం అయి వుండాలి.

ఇలాంటి విపత్కర పరిస్థితిలో అధికారంలోకి వచ్చిన పార్టీకి రెండే మార్గాలుంటాయి. ఒకటి తన వాగ్దానాలకు తానే తూట్లు పొడిచి తాటికాయంత పథకాన్ని మిరియపుగింజ సైజుకు కుదించి, అమలు చెయ్యడం, ఇది చౌకబారు రాజకీయం. దీనివల్ల ప్రజలు తాము దగాపడ్డామని, మోసపోయామని భావిస్తారు. ఇది ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. మరో మార్గం వాస్తవాల మీద ఆధారపడి తగిన పరిష్కారాలు ప్రకటించే రాజనీతిజ్ఞతను ప్రదర్శించడం. ఉన్న పరిస్థితులను ప్రజల ముందుంచి ఆచరణయోగ్యమైన పరిష్కారాన్ని ప్రకటించి అమలు చేస్తే ప్రజలు దానిని అర్థం చేసుకుంటారు. ఆశాభంగం చెందకుండా భవిష్యత్తు మీద విశ్వాసాన్ని వుంచుకుంటారు. ఇలాంటి రాజనీతిజ్ఞతను ప్రదర్శించాల్సిన చోట రాష్ట్ర ప్రభుత్వం చౌకబారు పద్ధతుల్ని ఎంచుకున్నట్లు కనిపిస్తున్నది.

**రైతుల రుణమాఫీల విషయం చాలా ఆర్థికభారంతో కూడుకున్నది. ఒక్కసారిగా 25, 30 వేల కోట్లు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. ఇలాంటి వాటికి రిజర్వుబ్యాంకు, కేంద్ర సహాయం రాదని తెలుసు. ఈ భారాన్ని కుదించడానికి కమిటీలు వేశారు. నియమాల మెలికలు పెట్టారు. మొత్తంమీద రైతులను ఆశాభంగం పాలు చెయ్యడమే గాకుండా ఒక పక్క బంగారం వేలాలు, మరో పక్క కొత్త అప్పులు పుట్టని పరిస్థితి తెచ్చి పెట్టారు.**

**బండి ముందు గుర్రం వెనుక**

రైతుల రుణమాఫీల విషయం చాలా ఆర్థికభారంతో కూడుకున్నది. ఒక్కసారిగా 25, 30 వేల కోట్లు ఇచ్చే పరిస్థితి ప్రభుత్వానికి లేదు. ఇలాంటి వాటికి రిజర్వుబ్యాంకు, కేంద్ర సహాయం రాదని తెలుసు. ఈ భారాన్ని కుదించడానికి కమిటీలు వేశారు. నియమాల మెలికలు పెట్టారు. మొత్తంమీద రైతులను ఆశాభంగం పాలు చెయ్యడమే గాకుండా ఒక పక్క బంగారం వేలాలు, మరో పక్క కొత్త అప్పులు పుట్టని పరిస్థితి తెచ్చి పెట్టారు. అంతిమంగా దీని నుండి బైట పడడానికి గత్యంతరం లేక వాయిదాల బాండ్ల రూపంలో రెండు మూడేళ్ళలో సర్దుబాటు అయ్యే పద్ధతిని తెరమీదకు తెచ్చారు. ముందే పరిస్థితిని వివరించి మీ అప్పులు మీరు చెల్లించుకోండి మేము ఈ సంవత్సరం నుండే చెల్లుబాటు అయ్యేవిధంగా బాండ్లు ఇస్తామని ప్రకటించి వుంటే పరిస్థితి వేరుగా వుండేది. ఇప్పుడు వాయిదా బాండ్లూ తప్పలేదు, విశ్వసనీయతా నిలబడలేదు.

ఇలాంటి మరో పథకం నెలకు 1000 రూపాయలు ఇచ్చే సామాజిక పెన్షన్లు. ఇప్పటివరకు నెలకు 200 రూపాయలుగా వున్న పెన్షన్లను ఒకేసారి 5 రెట్లుకు పెంచి ఇస్తామని వాగ్దానం చేశారు. ప్రస్తుతం ఆర్థిక స్థితి నేపథ్యంలో అది ప్రభుత్వానికి భారమయింది. ఈ పథకం అమలు ప్రారంభించకుండానే బోగస్ పెన్షన్ల ఏరివేతను ప్రకటించారు. బోగస్ పెన్షన్లు తొలగించాల్సిందే. కాని ఇది ప్రజలకు ఇచ్చిన సంకేతం వేరుగా ఉంది. ఉన్న పెన్షన్లను తొలగించడానికి వేసిన ఎత్తుగడగా భావిస్తున్నారు. కొత్తది రాకపోగా వున్నది ఊడుతుందన్న ఆందోళనలో పడ్డారు. ఇక్కడా ప్రభుత్వం తమను దగా చేస్తుందన్న భావనే బలపడుతున్నది.

దీనికి భిన్నంగా ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న రెండువందలకు బదులు ఈ సంవత్సరం నాలుగు వందలతో ప్రారంభించి ఏటా రెండువందలు పెంచుతామని ప్రకటించి వుంటే ప్రజలు దానిని అర్థం చేసుకునేవారు. అప్పుడు బోగస్ పెన్షన్ల ఏరివేతను అంతగా పట్టించుకునేవారు కాదు.

అలాగే ఉచితంగా బియ్యం పథకం మీద చంద్రబాబు ప్రభుత్వం మాట్లాడడం లేదు. నిరుద్యోగ భృతి మాట తలపెట్టడం లేదు. ఇంకా ఇంకా చేసిన అనేక వాగ్దానాల ఊసు ఎత్తడం లేదు. వీటన్నింటి నుండి తాము తప్పించుకున్నట్లే ప్రభుత్వం భావించినా వాటి ఉరితాళ్లు ఎప్పుడో ఒకప్పుడు బిగిసే పరిస్థితి వస్తుంది.

చంద్రబాబు ప్రభుత్వం 100 రోజుల సంబరాలు జరిపితే వీటన్నింటినీ ప్రస్తావించిక తప్పదు. అందుకే చంద్రబాబు ప్రభుత్వం సంబరాల జోలికి పోవడం లేదనిపిస్తున్నది.

చంద్రబాబు తన వాగ్దాన భంగాలను మరుగున పర్చుకోడానికి కొత్త భ్రమల చుట్టూ ప్రజల్ని తిప్పడానికి ప్రయత్నిస్తున్నారు. తక్షణ ప్రాధాన్యత లేని అంశాలను ముందుకు తెచ్చి వాటి చుట్టూ పత్రికలు, ప్రసార మాధ్యమాలలో ప్రకటనలు గుప్పిస్తున్నారు. అన్ని జిల్లాల ప్రజల్ని ఊహా ప్రపంచంలో విహరింపజేసే పథకాల తోరణాలను ప్రకటిస్తున్నారు.

ఇందులో రాష్ట్ర రాజధాని సమస్య ఒకటి. దీని మీద ఒక నిపుణుల కమిటీ, ఒక మంత్రుల కమిటీ, భూసేకరణ కమిటీలు ఒకదాని తర్వాత ఒకటి ప్రకటించుకుంటూ పోతున్నారు. ఒక అపూర్వ రాజధానిని నిర్మించనున్నట్లు అందుకోసం మంత్రుల బృందంతోపాటు కొన్నిచోట్లకు ముఖ్యమంత్రి కూడా కొత్త రాజధానుల పరిశీలనకు పర్యటనలు సాగిస్తున్నారు.

నిజానికి 10 సంవత్సరాలపాటు హైదరాబాదు ఉమ్మడి రాజధానిగా వుంటుంది. శాసనసభ, సెక్రటేరియేట్, శాసన సభ్యుల నివాసాలకు అక్కడ అన్ని ఏర్పాట్లు వున్నాయి. పైగా ఇదే ముఖ్యమంత్రి గతంలో 9 ఏళ్లపాటు హైదరాబాద్ నుండే ఈ 13 జిల్లాలతోపాటు మరో 10 తెలంగాణా జిల్లాల పరిపాలన సాగించారు. ఇప్పుడు అక్కడ నుండి 13 జిల్లాలను పాలించడానికి వచ్చిన ఇబ్బంది తక్షణం ఏమీ లేదు. ఒకటి రెండేళ్లు స్థిరపడిన తర్వాత తలకెత్తుకోవలసిన రాజధానిని ఇప్పుడే హడావిడి చెయ్యడంలో కనిపించే కారణం ప్రజల్ని పక్కదారి పట్టించడం తప్ప మరొకటిగా కనిపించడం లేదు.

అలాగే మూడు నెలలలో ప్రభుత్వ కార్యాలయాలను తరలించడానికి ఒక కమిటీని నియమించారు. విజయవాడ పరిసరాలలో ప్రభుత్వ, ప్రయివేటు గృహాల అన్వేషణ ప్రారంభించారు. ఇది పరిపాలనను కొంతకాలం పాటు అస్తవ్యస్తం చేసేది తప్ప పరిపాలనను గాడిలో పెట్టేది కాదు. ఇక జిల్లాలలో నెలకొల్ప తలపెట్టిన అద్భుత కార్యాల తోరణాల ప్రకటన, నిర్దిష్ట గడువు, నిధుల ప్రసక్తి లేని ప్రకటనలు కూడా ఇందులో అంతర్భాగాలే.

కోస్తాతీరంలో 14 పోర్టులు, ప్రతిజిల్లాకు విమానాశ్రయాలు వగైరాల మీద చేస్తున్న ప్రకటనలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ప్రస్తుతం నడుస్తున్న మూడు పోర్టులకు వస్తున్న నౌకలు ఎన్ని? రవాణ చేస్తున్న సరుకు ఎంత? అలాగే నాలుగు విమానాశ్రయాలలో దిగుతున్న విమానాలెన్ని? ప్రయాణీకుల సంఖ్య ఎంత? అన్న కనీస ధ్యాస కూడా ఈ ప్రకటనల వెనక లేదు.

ఒక కొత్త ప్రభుత్వం రాగానే చెయ్యాల్సిన పని పరిపాలనను దారిలో పెట్టడం. కాని చంద్రబాబు ప్రభుత్వం రాజధాని పేరుతో, కార్యాలయాల తరలింపు పేరుతో పరిపాలనను అయోమయంలో పడేశారు. మరోపక్క ఉన్న పాలనావ్యవస్థల్ని పనిచేయించడం, ప్రజలకి మెరుగైన సేవలు అందించడం మీద దృష్టి సారించడం తక్షణ అవసరం. అందుకు నిర్దిష్ట పాలనా సంస్కరణలు ప్రకటించాలి. పాఠశాల విద్యను మెరుగుపర్చడం ప్రాథమిక, ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థల పనితీరు మార్చడం ప్రభుత్వం చేతిలో ఉన్న పని. అదనపు ఖర్చు అంతగా లేకుండా సేవలందించే అవకాశం వుంది. అలాగే గ్రామాలు, పట్టణాలలో పౌరసేవల మీద దృష్టి పెట్టడం వాటికి కనీస ఆర్థిక కేటాయింపులతో ప్రజలకు ఊరట కల్పించే తక్షణ చర్యలు తీసుకోవడం సాధ్యపడేది.

ప్రభుత్వ ప్రాధాన్యతలలో ఇలాంటివి లేకుండాపోయాయి. మంత్రులంతా రాజధాని, భూసేకరణ, వగైరాలలో మునిగి తేలుతున్నారు. ఇక వనరుల సేకరణ మీద స్థిరమైన నిర్ణయాలు దుబారా అరికట్టడానికి తగిన సంస్కరణలు మీద అడపాదడపా మాటలే గాని చేతలు కనిపించడం లేదు. అలాగే ఉన్న కొద్దిపాటి ఆర్థిక వనరులను తక్కువ చదువు వున్నవారికి కూడా ఉపాధి అవకాశాలు ఇచ్చే వస్తూత్పత్తిరంగ పరిశ్రమల ప్రోత్సాహానికి తగిన మౌలిక వసతుల మీద పెట్టాల్సిన తరుణంలో ప్రభుత్వం దగ్గర అలాంటి రాజకీయ సంకల్పం కనిపించటం లేదు.

ప్రభుత్వం ప్రతిరోజు ఎన్ని కలలనైనా కనొచ్చు. కాని ప్రజలు మాత్రం ఎల్లకాలం కలలలోనే జీవించలేరు. వారి కలలు కల్లలైతే పాలకులకు భవిష్యత్తు ఉండదు. ఈ వంద రోజుల పాలనలో సాధించిన ఘనకార్యాలకంటే సమాధానం చెప్పుకోవలసిన సమస్యలే ఎక్కువయినప్పుడు సంబరాలు ఎలా వుంటాయి. ■

# "రూసా" నిధులను వినియోగించుకోని రెండు రాష్ట్రాలు

- రూ.500 కోట్లు వచ్చే వీలున్నా వీడని అలక్ష్యం
- ఆసక్తి చూపని ఆంధ్ర, తెలంగాణ
- ఇంకా ఎస్పీడీలనే నియమించని వైనం
- మళ్లీ విడివిడిగా ప్రతిపాదనలు పంపాలన్న కేంద్రం

అడగనిదే అమ్మయినా పెట్టదంటారు! కానీ అడగకుండానే గోరు ముద్దలు పెడతామంటుంటే నోరు తెరవనంటున్నాయి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు! చాలా ప్రతిపాదనలకు సాయం చేయండంటూ కేంద్రాన్ని అడిగే రెండు రాష్ట్రాలు... కేంద్రమే స్వయంగా డబ్బులున్నాయి తీసుకోండంటే నోరు మెదపట్లేదు. దీనివల్ల కేంద్రం నుంచి రావాల్సిన సొమ్ము రాకుండా పోతోంది! తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖల నిర్లిప్తత కారణంగా రాష్ట్రీయ ఉచ్ఛతర్ శిక్ష అభియాన్ (రూసా) కింద కేంద్రం ఇస్తానంటున్న సుమారు రూ. 500 కోట్లు (250-250) రాకుండా ఆగిపోయాయి. కేంద్రం మొదట సన్నాహక గ్రాంటుగా ఇచ్చిన రూ. 3.25 కోట్లు కూడా బ్యాంకులోనే మురిగిపోతున్నాయి. విభజనకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తరపున సుమారు రూ. 2500 కోట్లకు ప్రణాళికలు పంపించారు. ఆ తర్వాత కేంద్రం ప్రణాళికలను విడివిడిగా పంపాలని కోరింది. మళ్లీ జిల్లాల వారీగా అంచనాల్ని సవరించి, రెండు రాష్ట్రాల పేరిట విడివిడిగా ప్రతిపాదనలు పంపించారు. తెలంగాణకు సుమారు రూ. 1300 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. 1700 కోట్లు అంచనా వేశారు. విశ్వవిద్యాలయాల్లో పరిశోధన, కొత్త నిర్మాణాలు, పాత వాటి మరమ్మతులు తదితరాలకు పనులు జరుగుతున్న తీరును బట్టి... దశలవారీగా ఈ సొమ్మును (మూడేళ్లపై) విడుదల చేస్తారు. తొలి విడతగా రూ. 257 కోట్లు ఇవ్వటానికి సిద్ధమయ్యారు. ప్రాజెక్టు నివేదిక తీసుకొని వెళ్లి ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు ముందు వివరిస్తే ఆ డబ్బులు విడుదల చేస్తారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి అప్పుడు ప్రాజెక్టును పంపించారు. కానీ తర్వాత విభజన జరగటంతో అది మూలన పడింది. దాన్ని పట్టించుకునేవారు లేకుండా పోయారు. కేంద్రం నుంచి రూసా నిధులు రావాలంటే.. రాష్ట్రానికి చట్టబద్ధత కలగిన ఉన్నత విద్యామండలి ఉండాలి. రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (ఎస్.పి.డి.)ని నియమించటం తప్పనిసరి. ఎస్పీడీ, నోడల్ అధికారి కలసి సంయుక్త ఖాతా తెరిస్తేనే నిధులు ఖర్చు చేసుకోవచ్చు. కానీ రెండు రాష్ట్రాల ఉన్నత విద్యాశాఖ కార్యదర్శులు ఎస్పీడీలను నియమించటంలో ఆసక్తి చూపించలేదు. ఫలితంగా నిధుల రాక ఆగిపోయింది. "ఇప్పటికే ఈ విద్యా సంవత్సరంలో దాదాపు ఆరునెలలు గడిచిపోయాయి. మిగిలిన రాష్ట్రాలు చకచకా రూసా కింద నిధులు తీసుకొని ఖర్చు పెట్టుకుంటున్నాయి. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు రెండూ విభేదాలు వీడి...ఉన్నత విద్యామండలిని విభజించుకొని నిధులు తెచ్చుకోవాలి. లేదంటే నష్టపోతాం" అని విద్యాశాఖ ఉన్నతాధికారి ఒకరు వ్యాఖ్యానించారు. కాగా రెండురోజుల కింద తెలంగాణ అధికారులిద్దరు ఢిల్లీ వెళ్లి రూసా నిధులను అడగ్గా... మళ్లీ రెండు రాష్ట్రాలు విడివిడిగా తమ ప్రాధాన్యాలను వివరిస్తూ నివేదికలు పంపాలనీ, ఎస్పీడీలను త్వరగా నియమించుకోవాలనీ అధికారులు స్పష్టం చేసినట్లు సమాచారం. ■



# కాగితాలపైనే మరుగుదొడ్లు

- నిర్వహణ సర్కారీ బడుల్లో
- ఘోరం.. ఘోరం
- రెండు రాష్ట్రాల్లోని పరిస్థితులూ ఇంతే!
- కేంద్ర గణాంకాలు సుస్పష్టం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం కాగితాలకే పరిమితమైంది. దేశంలో వెనుకబడ్డ రాష్ట్రాలుగా గుర్తింపు పొందిన మేఘాలయ, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల తర్వాత తెలుగు రాష్ట్రాలు మరుగుదొడ్ల సౌకర్యాల కల్పన, వినియోగం, పర్యవేక్షణపరంగా దారుణస్థితిలో ఉన్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా మరుగుదొడ్లను కల్పించడంలోనూ వెనుకబడ్డాయి. ఈ రెండు రాష్ట్రాల్లో నాలుగో వంతు పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్లే లేవని కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ విషయంలో గుజరాత్ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రధాని మోడీ ప్రభుత్వ బడుల్లో మరుగుదొడ్ల సౌకర్యం, పర్యవేక్షణ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపారు. ఆగస్టు 15వ తేదీనాటి ప్రసంగంలో ప్రధాని మోడీ మరుగుదొడ్ల సౌకర్యాల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో జాతీయ స్థాయిలో చర్చ మొదలైంది. దేశంలోని పాఠశాలలు, వాటిల్లో మరుగుదొడ్ల సౌకర్యం, పర్యవేక్షణ వంటి అంశాలపై 2013-14 విద్యా సంవత్సరానికి సంబంధించిన గణాంకాల ఆధారంగా కేంద్ర మానవ వనరుల శాఖ కార్యాచరణ మొదలుపెట్టింది.

### "విద్యాహక్కు" ప్రకారం

విద్యా హక్కు చట్టం ప్రకారం బాలబాలికల కోసం విద్యాలయాలు ప్రత్యేక మరుగుదొడ్ల సౌకర్యాన్ని కల్పించాల్సి ఉంది. సర్వశిక్షా అభియాన్ ఇతర పథకాల కింద ఈ సౌకర్యాన్ని కల్పించే అవకాశం ఉన్నా పరిస్థితులు మెరుగుపడటం లేదు. బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు లేక చదువులో వీరి కొనసాగింపు తగ్గుతోందని ఏపీటీఎఫ్ నాయకుడు జి.హృదయరాజు అంటున్నారు. బాలికల మరుగుదొడ్లు లేని పాఠశాలలపరంగా దేశంలోనే తెలంగాణ తృతీయ స్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలోని 27.04% పాఠశాలల్లో మరుగుదొడ్ల కొరత ఉంది. ఈ విషయంలో ఏపీ ఐదో (19.9%) స్థానంలో ఉంది.

### నీటి వసతి...పర్యవేక్షణ లేదు

పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం ఉన్నా ముఖ్యంగా నీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రహరీలు లేనందున వీటి నిర్వహణ కూడా గందరగోళంగా తయారవుతోంది. పాఠశాలలకు ప్రభుత్వాలు అదనంగా ఇచ్చే మొత్తం విద్యుత్తు, స్టేషనరీకి సరిపోవటం లేదు. ఈ పరిస్థితులు నెలవారీ వేతనంపై ప్రత్యేకంగా వ్యక్తిని నియమించుకునేందుకు గాని, నీటి సమస్యను అధిగమించేందుకు గాని వీలు కల్పించడం లేదని ఓ మండల విద్యాధికారి ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం ఆదేశాలతో పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యాల కల్పన పరంగా హడావుడి పెరిగినా పర్యవేక్షణను విస్మరించడం వల్ల నిధులు నిష్ఫలమవుతున్నాయి. ■



# ఆధార్‌తో అక్రమాలకు అడ్డుకట్ట

- అన్ని పథకాలకు నంబరు అనుసంధానం
- రుణమాఫీ నుంచి లైసెన్స్ పొందే వరకు
- కాలక్రమంలో కొత్త పరిణామాలు
- ప్రభుత్వ గుప్పెట్లో అందరి వివరాలు

ఆధార్‌తో అక్రమార్కుల గుట్టు రట్టు కాబోతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధార్ నెంబరును సంక్షేమ పథకాల అమలు, ఆయా శాఖల కార్యకలాపాలకు అనుసంధానం చేసే ప్రక్రియను వేగవంతం చేసింది. ఆధార్ నెంబరుతో ప్రతి కుటుంబ వివరాలు ప్రభుత్వానికి అందనున్నాయి. దీనివల్ల కాలక్రమంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాలను సమర్థంగా అమలు చేసేందుకు అనుకూలంగా ఉంటోందని సంబంధిత వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఇందులో భాగంగానే.. రాష్ట్ర విద్యా శాఖ, సంక్షేమ శాఖలు, పంచాయతీ రాజ్, విద్యుత్తు, రెవెన్యూ, పౌర సరఫరా, ఇతర శాఖలు ఆధార్ నెంబరు వినియోగంతోనే కార్యకలాపాలు జరిపేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వమూ ఆధార్‌కు తగిన ప్రాచుర్యాన్ని కల్పిస్తోంది. మొదట్లో దీని సద్వినియోగంపై గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా గ్యాస్ సబ్సిడీ పంపిణీపై పెద్దఎత్తున దుమారం రేకెత్తింది. విభజన అనంతరం అధికారంలోనికి వచ్చిన తెదేపా ప్రభుత్వం ఆధార్ నెంబరు ఉపయోగాన్ని క్రమేణ పెంచుకుంటూ పోతోంది.

### రుణమాఫీ నుంచి...!

రైతుల రుణ మాఫీ కోసం ఆధార్ నెంబరును తప్పనిసరి చేశారు. ఇందుకు అనుగుణంగానే రైతుల వివరాల సేకరణ జరుగుతోంది. సహకార సంఘాలు, జాతీయ బ్యాంకులు సైతం ఆధార్ సద్వినియోగంపై దృష్టిపెట్టి అవసరమైన చర్యలకు ఉపక్రమించాయి. తద్వారా అర్హులైన వారికి మాత్రమే రుణాలు అందచేయబోతున్నాయి. ప్రతి రైతుకు సంబంధించిన భూముల వివరాలను నమోదు చేసే వెబ్‌ల్యాండ్‌లోనూ ఆధార్ వివరాలు చేరుస్తున్నారు. రిజిస్ట్రేషన్ శాఖ కనుక భూముల క్రయ విక్రయాలకు ఆధార్, పాన్ నెంబరును అనివార్యం చేస్తే అసలు ఒక్కొక్కరి ఆర్థిక స్థోమత బహిరంగం కానుంది. పేదలకు అందచేసే గృహాల కేటాయింపులోనూ ఆధార్ కార్డు వివరాలను యుద్ధ ప్రాతిపదికన నమోదు చేయించారు.

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే వారిలో 60% మంది విద్యార్థుల ఆధార్ నెంబర్లను సేకరించారు. వీటి ద్వారా బోగస్ ప్రవేశాలను ఆదిలోనే గుర్తించే వీలుంది. బోధన రుసుముల చెల్లింపుల పథకం కింద నిధులు వృధా కాకుండా ఉండేందుకు, అర్హులకు మాత్రమే ఈ పథకం వర్తించేలా కొత్త మార్గదర్శకాలు రాబోతున్నాయి. తల్లిదండ్రుల పాన్‌కార్డు, ఆధార్ కార్డుల సాయంతో విద్యార్థుల ఆర్థిక స్థోమతపై అవగాహనకు రాబోతున్నారు. 2014-15 విద్యా సంవత్సరం నుంచే ఇందులో అవసరమైన మార్పులు తీసుకు రావాలన్న దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. సంతృప్తికర స్థాయిలో సుమారు 15 లక్షల మంది విద్యార్థులు ఈ పథకం కింద ప్రయోజనం పొందుతున్నారు. ఆధార్ కార్డు ఉపయోగాన్ని విస్తృతం చేస్తూ.. కొత్త మార్గదర్శకాలు వస్తే.. ఈ సంఖ్యలో కొంత కోత పడటం ఖాయమని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి.

### విద్యుత్తు కనెక్షన్‌కూ ఆధార్!

ప్రస్తుతం విద్యుత్తు శాఖ ద్వారా ఓ వ్యక్తి తన ఇళ్లకు అవసరమైన ఎన్ని విద్యుత్తు కనెక్షన్లను తీసుకున్నా అవి బహిర్గతం కావడం లేదు. ఈ పరిస్థితుల్లో ఆధార్ నెంబరు సాయంతో విద్యుత్తు కనెక్షన్లను ఇవ్వడం ద్వారా ఓ వ్యక్తి పేరుతో ఎన్నెన్ని ఇళ్లు ఉన్నాయన్న వివరాలు వెంటనే తెలుసుకునేందుకు దోహదపడుతోంది. దీంతోపాటు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఉన్న పాత వినియోగదారులకు సంబంధించిన ఆధార్ వివరాలను కూడా సేకరించి అనుసంధానం చేస్తున్నారు.

### పట్టాదారు పాసు పుస్తకాలకూ!

రెవెన్యూ శాఖలో పట్టాదారు పాసు పుస్తకాలకూ ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఓ లబ్ధిదారుడు లేదా ఓ రైతుకి ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల పొలం ఉందన్న వివరాలు వెంటనే తెలిసిపోతాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఉండే వారికి.. ఎకరాల మేర పొలం ఉన్నా అధికారుల వివరాలు కోరినప్పుడు ఏమీలేదని రిక్తహస్తాలు చూపుతున్నారు. అదే ఆధార్

నెంబరును అనుసంధానంచేస్తే వెంటనే ఆ వ్యక్తి పేరు మీద ఎన్ని ఉన్నాయో తెలుస్తాయి. దానివల్ల సంబంధిత వ్యక్తి ఆర్థిక స్థితిగతులు, సన్న లేదా చిన్నకారు రైతా అన్న విషయం వెంటనే తెలిసిపోతోంది. ఇందుకు అనుగుణంగా పథకాలు అమలు చేసేందుకు అవకాశం ఏర్పడబోతుంది.

**రేషన్, పింఛన్ల విషయంలో!**

రేషన్ కార్డుల్లో బోగస్‌లను తేల్చేందుకు, సరకుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకూ ఆధార్ అస్త్రాన్నే ప్రభుత్వం ప్రయోగిస్తోంది. ఇప్పటి వరకూ రాష్ట్రంలోని రేషన్ కార్డు డేటాబేస్‌కు ఆధార్ అనుసంధానం ఇప్పటికే 97 శాతం వరకు పూర్తి చేశారు. ఆధార్ లేని లబ్ధిదారుల వివరాలను తేల్చడం ద్వారా ఆ మేరకు రేషన్‌లో కోత విధించేందుకు కసరత్తు చేస్తున్నారు. రాష్ట్రంలో కొన్నిచోట్ల వృద్ధులు ఒకే పేరు మీద వివిధ గ్రామాల్లో ఫించన్లు పొందుతున్నారు. ఆధార్ కార్డు నెంబరుతో ఈ వ్యవహారాలను అరికట్టచ్చు. ఫించన్ ఐడీ నెంబర్లను ఆధార్ నెంబరుతో అనుసంధానం చేస్తున్నారు. దీనివల్ల అనర్హులు కోకొల్లలుగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ప్రక్రియ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోంది. రవాణా శాఖ వాహనాల రిజిస్ట్రేషన్‌కు, వాహనాలను నడిపేందుకు అవసరమైన లైసెన్సుల మంజూరుకూ ఆధార్ నెంబరును అడుగుతున్నారు. ఆధార్ కార్డు మంజూరు సమయంలో ప్రజలు చాలాచోట్ల తమ వ్యక్తిగత వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేసుకోలేదు. దీనివల్ల కేవలం ఆధార్ కార్డు సాయంతో అక్రమార్కులను అరికట్టడం కష్టం. అది తొలిదశ వడపోతగా ఉపయోగపడుతుంది. ■

# బోగస్‌ల వేట!

బోగస్ కార్డుల ఏరివేత అంచనాలకు మించి ఫలితం ఇవ్వటంతో అనర్హుల చేతుల్లో ఉన్న తెల్ల రేషన్‌కార్డులనూ తొలగించేందుకు తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. సమగ్ర కుటుంబ సర్వే విశ్లేషణ పూర్తి కావటంతో అనర్హుల గుర్తింపు సులువవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. బోగస్ కార్డుల గుర్తింపుపర్వం ఈ నెలాఖరుకు పూర్తి కానుంది. అధికారుల అంచనా ప్రకారం ఇప్పటికి 11.5 లక్షల బోగస్ కార్డులను రద్దు చేశారు. వీటి పరిధిలో 52 లక్షల మంది పేర్లను కార్డుల జాబితాల నుంచి తొలగించినట్లయింది. నెలాఖరులోగా మరో నాలుగైదు లక్షల బోగస్ కార్డులను తొలగించే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో బోగస్ రేషన్‌కార్డులు ఉన్నాయని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అసెంబ్లీలో ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రంలో 83.26 లక్షల కుటుంబాలుంటే తెల్లకార్డులే 91.85 లక్షల కార్డులు ఉండటం గమనార్హం. గులాబీ కార్డులు కూడా కలిపితే వీటి సంఖ్య 1.20 కోట్ల వరకు ఉంటుంది. బోగస్‌కార్డులు అప్పగించాలని ముఖ్యమంత్రి కోరటంతోపాటు అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టటంతో గడిచిన నాలుగు నెలల్లో భారీగానే బోగస్‌కార్డులను తొలగించగలిగారు. దీంతో ప్రస్తుతం కార్డుల సంఖ్య 80.32 లక్షలకు చేరింది.

**భారీ సంఖ్యలోనే అనర్హులు :** రాష్ట్రంలో కనీసం ఆరేడు లక్షల మంది అనర్హులైన తెల్లకార్డుదారులు ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. సమగ్ర కుటుంబ సర్వే గణాంకాల మదింపును అధికారులు ఇటీవల పూర్తి చేశారు. ఆ సమాచారాన్ని శాఖల వారీగా సమీక్షించే క్రమంలో వచ్చే వారం పౌరసరఫరాల శాఖను ప్రభుత్వం సమీక్షించనుంది. రాష్ట్రంలో కుటుంబాల సంఖ్య కోటి దాటింది. మునుపటితో పోలిస్తే కుటుంబాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈమేరకు కార్డు పొందేందుకు అర్హులు కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే తొలగించిన 11.5 లక్షల బోగస్‌కార్డులకు తోడు అనర్హుల వద్ద ఉన్నవీ తొలగిస్తే కనీసం 20 లక్షల కార్డులు అవుతాయని లెక్కగడుతున్నారు. రేషన్ కార్డుల జారీ తదితర వ్యవహారాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ బియ్యం (తెల్ల) కార్డులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. దీంతో సాధ్యమైనంత త్వరగా అనర్హుల చేతుల్లో ఉన్న కార్డులను తొలగించేందుకు కసరత్తు చేస్తున్నారు. తద్వారా అర్హత ఉండీ కార్డు లేనివారికి మంజూరు చేసేందుకు మార్గం సుగమం కానుంది. ■

# విడిపోయి సమైక్యం..ఏపీ, తెలంగాణ యుగళగీతం

- సర్పాల్ నౌపారా బొగ్గు గనికి జాయింట్ వెంచర్
- టీ-జెన్‌కో భాగస్వామ్యానికి సీఎం గ్రీన్ సిగ్నల్
- ఉమ్మడిగా అభివృద్ధి చేయడానికి సన్నద్ధం
- నేడు కేంద్ర ప్రభుత్వానికి లేఖ

రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి ఉప్పు, నిప్పులా ఉంటున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య స్నేహ బంధం చిగురించింది. విడిపోయినా సమైక్యంగా కేంద్రం సూచనలతో యుగళగీతానికి. కలిసి పని చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన సూచనను ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. విడిపోయినా అభివృద్ధి యుగళగీతం పాడాలని నిర్ణయించుకున్నాయి. ఈ అరుదైన సందర్భానికి ఒడిసాలోని సర్పాల్ నౌపారా బొగ్గుగని వేదిక మారింది. ఈ బొగ్గు గనిని సమైక్యాంధ్రప్రదేశ్‌కు గతంలో కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఈ కేటాయింపును సుప్రీంకోర్టు కూడా రద్దు చేయలేదు. ఈ బొగ్గు గనిని అభివృద్ధి చేయడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు కలిసి పని చేయాలని, రెండు రాష్ట్రాలు కలిసి ఒక భాగస్వామ్య సంస్థను (జాయింట్‌వెంచర్‌ను) నెలకొల్పాలని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ సూచించింది.

తెలంగాణ ప్రభుత్వంతో కలిసి జాయింట్‌వెంచర్‌ను నెలకొల్పేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరించింది. అయితే.. ఈ ప్రతిపాదన విషయంలో సానుకూలంగా స్పందించాలా? వద్దా? అని ఊగిసలాడిన తెలంగాణ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి జాయింట్ వెంచర్‌కు అంగీకరించింది. ఇందుకు సీఎం కేసీఆర్ పచ్చజెండా ఊపారు. తెలంగాణ ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్‌కే జోషి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డీ ప్రభాకరరావు, తన ముఖ్య కార్యదర్శి నర్సింగరావుతో ఈ అంశంపై సీఎం కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జెన్‌కో/ ఖనిజాభివృద్ధి సంస్థతో కలిసి సర్పాల్ నౌపారా బొగ్గుగనిని అభివృద్ధి చేయడానికి తెలంగాణ జెన్‌కోకు సీఎం అనుమతినిచ్చారు. గతంలో సింగరేణి సంస్థను భాగస్వామ్య సంస్థగా ప్రతిపాదించాలన్న సూచన కూడా వచ్చింది.

చివరకు ఆ అవకాశాన్ని తెలంగాణ జెన్‌కోకు సీఎం కేసీఆర్ కల్పించారు. సర్పాల్ నౌపారా బొగ్గు గనిలో మొత్తం 280 మిలియన్ టన్నుల బొగ్గు లభిస్తుంది. ఇందులో 140 మిలియన్ టన్నులు తెలంగాణ జెన్‌కోకు, 140 మిలియన్ టన్నులు ఆంధ్రప్రదేశ్ జెన్‌కోకు లభిస్తుంది. ఈ బొగ్గుతో వరం గల్ జిల్లా భూపాలపల్లి వద్ద ఉన్న 600 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు అవసరాలను, భవిష్యత్తులో నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు అవసరాలను తీర్చవచ్చని తెలంగాణ జెన్‌కో వర్గాలు వివరించాయి. ■



# కాగితపు బతుకమ్మ

- బండారు రామ్మోహన్‌రావు

బతుకమ్మ పండుగ వచ్చిందంటే గ్రామాల్లో సందడే సందడి. పండుగ సెప్టెంబర్ చివరిలో వస్తే వర్షాకాలం పూర్తిగా పోదు కనుక గ్రామాలు చిత్తడి చిత్తడిగా వుండేవి. అక్టోబరు మొదటివారంలో వస్తే అప్పటికే వర్షాలు వెనుకబడతాయి కనుక పండుగను బాగా ఎంజాయ్ చేసేవాళ్ళం. పప్పు బెల్లాలు, అటుకులు తీరొక్క ప్రసాదాలతో ప్రతిరోజు పండుగే. బతుకమ్మ ఆడేవాళ్ళు తెచ్చిన ప్రసాదాలన్నీ కలిపి అందరికీ పంచేవాళ్ళు. వర్షాలు సకాలంలో పడితే బతుకమ్మ పూలకి కొరత వుండేది కాదు. గునుగు పూలు, తంగేడుపూలు బాగా దొరికేవి. మా నాన్నగారి చిటికెన వేలు పట్టుకుని పొలాలన్నీ తిరిగిన రోజులు గుర్తున్నాయి. పొలాలు అంటే వరి పొలాలు కాదు. తోటలు, నల్లరేగళ్లు, కంచెలు ఇలా వందల ఎకరాల భూములు వుండేవి. కాని మా సొంతం కావవి. ఎప్పుడో మా తాతల కాలంలో దున్నేవాడికి భూమి ఇచ్చినట్టు చాలామంది సేద్యం చేసుకునేవారు. కౌలు రూపేణ ఎంతో కొంత చెల్లించేవారు. అలా మా భూములు కాని భూముల్లో కిలోమీటర్లకొద్దీ తిరిగి సాయంత్రం కాళ్ళు నొప్పేడుతున్నాయంటే మా నాన్న నవ్వేవాడు. తిరగడానికే ఇంత కష్టమయితే వ్యవసాయం చేసేవారికి ఎంత కష్టం వుంటుంది అనేవారు. బర్రెలు, గొర్రెలు మేపుకొనే వాళ్ళు మా కంచెలో మేపుకున్నందుకు 'కంచెపుల్లెర' రూపేణ కొంత రొక్కం ముట్టజేప్పేవాళ్ళు. ఒక పొలానికి, ఇంకొక పొలానికి గట్లు దాటుతుంటే జారిపడేవాళ్ళం. 'పానాదుల్లో' ఒర్రెల్లో ఇసుకతో పిట్టగూళ్ళు కట్టేవాళ్ళం. కాలు తియ్యగానే అవి కుప్పకూలుతుంటే అయ్యో అని ఏడ్చేవాళ్ళం. మొక్కజొన్న కంకులు, కట్టెలతో కాల్చుకుని వేడిగా అక్కడికక్కడే తింటే అదో మజా. పొద్దున లేవగానే ఊరిబయట దొడ్లోనుండి అందరి మోతుబరి రైతుల పశువుల మందలు వరుసగా మేతకు వెళు తుంటే వెనకే అవి వేసే 'పెండ' గురించి ఉరుకులు, పరుగులు పెట్టే చిన్నపిల్లలు, వాకిట్లో 'సానిపి' కోసం 'పెండ' కావాలి కనుక వాటి వెంటబడే గృహిణులు ఇలా పొద్దునంతా సందడి సందడిగా వుండేది.



ఇక బతుకమ్మ పండుగ విషయానికివస్తే ఊళ్ళో పెద్ద బతుకమ్మ మాదే. అప్పటికే కాగితపు బతుకమ్మలు రాలేదు. పేదవాళ్ళేమో ఇంటిల్లపాది పొలానికి వెళ్ళి పూలను సేకరిస్తే మాకేమో కౌలుదారులు, జీతగాళ్ళు తెచ్చేవాళ్ళు. ఇక తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మ కోసం ఊళ్ళో అందరికన్నా మా బతుకమ్మే పెద్దగా వుండాలని మా భూములు చేసుకునే అందరినీ పూలు తెమ్మని పురమాయించేవాళ్ళం. ఉదయం తొమ్మిది నుండి పూలు రావడం మొదలయ్యేది. ఇప్పటి 'టాక్స్‌పేయర్స్‌మనీ' లాగా ఎవరు ఎంత భూమి చేసుకుంటున్నారో అంతకు తగ్గట్టు తంగేడు, గునుగు పూలను సేకరించాలి. అలా సేకరించిన పూలన్నీ రాసులుగా పోస్తే మా జీతగాళ్ళు మధ్యాహ్నం ఒంటిగంటకి బతుకమ్మను పేర్చడం మొదలు పెట్టేవాళ్ళు. సాయంత్రం కల్లా ఊళ్ళోని పెద్ద బతుకమ్మ రడీ. పూలు తెచ్చిన కౌలుదారులకి ఆ రోజు మా ఇంట్లో వండిన గారెలు, బూరెలు, పులిహోర ఇలా వంటకాలన్నీ వాళ్ళు తినేంత పెట్టేవాళ్ళం. ఎక్కడా డబ్బుల ప్రసక్తి వుండేది కాదు. పేద, ధనిక బేధం లేకుండా అందరూ కలగలిపి పండుగ చేసుకొనేవాళ్ళు. ఆడవాళ్ళు బతుకమ్మ ఆడితే మగవాళ్ళు చెరువు దగ్గరికి ఆ బతుకమ్మలు మోసేవాళ్ళు. చెరువులో పిల్లలు, మహిళలు పడకుండా గ్రామ సేవకులు కాపలా కాసేవాళ్ళు. పండుగ

జరిగే తొమ్మిదిరోజులు కొత్త చీరలు నగలతో అలంకరించుకుని మహిళలు మహారాణుల్లా ఊరేగేవాళ్ళు.

'రాజుగారి భోషాణంలో పాలు లాగా' నేను ఒక్కణ్నే పూలు తీసుకురాకపోతే ఏమవుతుంది అనే కొందరు అందరితోపాటు వచ్చి పొత్తు కలిసేవాళ్ళు. పూలు లేక మెల్ల మెల్లగా మా బతుకమ్మ చిక్కిపోతుంది. నాలుగైదు అడుగుల ఎత్తు పేర్చే బతుకమ్మ మెల్ల మెల్లగా పదేళ్ళు పోయేసరికి మూడు అడుగులకు వచ్చింది. దాన్ని అధిగమించడానికి బతుకమ్మను ఒక ఎత్తైన పీట మీద పెట్టేవాళ్ళు. ఇలా ఊరందరి కంటే పెద్ద బతుకమ్మ మాదే అని బడాయిపోయేవాళ్ళం. అప్పటికే సొంత వ్యవసాయం చేసే రైతులు మా బతుకమ్మ కంటే ఎత్తుగా వుండాలంటే పూల బతుకమ్మ బదులు కాగితపు బతుకమ్మను పెట్టేవాళ్ళు. ఎంతైనా అది ఒరిజినల్ కాదు కదా! అని తృప్తిపడేవాళ్ళం. ఇప్పుడు మా బతుకమ్మ చిన్న 'తపుకు' లోకి మారిపోయింది.

వంద బతుకమ్మలుంటే పూలతో పేర్చిన బతుకమ్మలు ఒకటి, రెండే వుంటున్నాయి. మిగతావన్నీ కాగితపు పూల బతుకమ్మలే. రాజకీయ పార్టీల్లో ప్రజల భాగస్వామ్యంలాగా మెల్ల మెల్లగా ప్రజల భాగస్వామ్యం లోపిస్తుంటే కార్పొరేట్ పార్టీలు కాగితపు బతుకమ్మల్లా ఎలా పుడుతున్నాయో గ్రామ సమిష్టి పూల సేకరణ నుండి అంగట్లో కాగితపు బతుకమ్మలు కొనుక్కునే సంస్కృతి పెరిగిపోయింది. మళ్ళీ ప్రజల భాగస్వామ్యం పెరిగితే కాగితపు బతుకమ్మల స్థానే పూల బతుకమ్మలు ఎలా వస్తాయో పార్టీలు కూడా ప్రజల ఆస్తులుగా వర్ధిల్లుతాయి. ఆ రోజు నిజమైన బతుకమ్మల్లా మంచి పార్టీలు మనగలుగుతాయి. ■

# వంటగ్యాస్, కిరోసిన్‌లతో నగదు మొదలు

- వచ్చే జనవరి లేదా ఏప్రిల్ నుంచి అమలుకు యోచన
- రాయితీ మొత్తాలు బ్యాంకు ఖాతాలకు
- ఈ నెల 30న రాష్ట్రాల సీఎస్‌లతో సమీక్షించనున్న కేంద్రం

నగదు బదిలీ పథకాన్ని మళ్లీ పట్టాలెక్కించేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. మునుపటి లోపాలను సరిదిద్ది.. వచ్చే ఏడాది నుంచి తిరిగి దీన్ని అమలు చేసేందుకు సమాయత్తమవుతోంది. ఇందుకోసం అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో ఈ నెల 30న ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించింది. యూపీఏ ప్రభుత్వం వంట గ్యాస్‌తో ఆరంభించిన నగదు బదిలీ అభాసుపాలవటంతో సార్వత్రిక ఎన్నికల ముందు దాన్ని నిలిపేసింది. ఈ పథకంలోని లోపాలను గుర్తించేందుకు కేంద్రం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. కొద్దిపాటి లోపాలను చక్కదిద్ది పథకాన్ని అమలు చేయవచ్చని కమిటీ సూచించటంతో ఆ దిశగా కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కేంద్రం సాయం అందించే అన్ని పథకాలకు దశలవారీగా నగదు బదిలీని అమలు చేయాలని యోచిస్తోంది.



పక్కా సమాచారం అందిస్తేనే ప్రయోజనం: నగదు బదిలీని మూడు అంశాలతో అరంభించేందుకు రంగం సిద్ధమవుతోంది. వంట గ్యాస్ సిలిండరుతోపాటు ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా కేంద్రం రాయితీ అందించే వస్తువులకూ వర్తింపజేయాలని నిర్ణయించారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కూడా తొలిదశలో చేర్చాలని నిర్ణయించినట్లు సమాచారం. వంటగ్యాస్ సిలిండరుకు నగదు బదిలీ పథకాన్ని అమలు చేసే అంశంపై చమురు సంస్థలతో ఇటీవల కేంద్రం సమీక్షించింది. బ్యాంకు ఖాతా సీడింగులో తలెత్తిన ఇబ్బందుల వల్ల పథకంపై ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమైందని చమురు సంస్థలు వివరించాయి.

### వచ్చే ఏడాది నుంచి అమలు

నగదు బదిలీని వచ్చే ఏడాది జనవరి లేదా ఏప్రిల్ నుంచి అమలులోకి తేనున్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఏడాదికి 12 సిలిండర్ల పథకం ఏప్రిల్‌తో ముగుస్తుండటంతో అప్పటి నుంచి దీన్ని అమలు చేసే అవకాశం ఉందని చమురు సంస్థలు అభిప్రాయపడుతున్నాయి. ■

# మాండలిన్ మాంత్రికుడు శ్రీనివాస్ కన్నుమూత

ఆరేళ్ళ వయసులోనే పాశ్చాత్య వాద్యపరికరంతో కర్ణాటక శ్రుతిలయలను మీటిన మేధావి నాలుగు దశాబ్దాల తన సంగీత ప్రస్థానాన్ని ముగించారు. ప్రముఖ మాండలిన్ కళాకారుడు ఉప్పలపు శ్రీనివాస్(45) సెప్టెంబర్ 26 ఉదయం 9.30 గంటలకు చెన్నైలోని అపోలో ఆసుపత్రిలో కన్నుమూశారు. ఇటీవలే కాలేయమార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న శ్రీనివాస్ కోలుకుంటున్నారని భావిస్తున్నంతలోనే రాత్రి ఆరోగ్యం క్షీణించడంతో మళ్లీ ఆసుపత్రిలో చేర్చారు. ఆయన తుదిశ్వాస విడిచారు. మాండలిన్‌పై కర్ణాటక సంగీతాన్ని పలికించిన తొలి కళాకారుడిగా వినుతికెక్కిన శ్రీనివాస్ 1969 ఫిబ్రవరి 28న పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జన్మించారు. సంగీత కళాకారుడైన తండ్రి సత్యనారాయణ బాటలో నడిచారు. బాల్యంలోనే సంగీతంపై కుమారుడి ఆసక్తిని గమనించి రుద్రరాజు సుబ్బరాజు వద్ద తండ్రి శిష్యరికం చేయించారు. గురువు పాడుతుంటే శ్రీనివాస్ మాండలిన్‌పై పలికించేవారు. పాశ్చాత్య సంగీతానికి అనువుగా మాండలిన్‌లో ఎనిమిది తీగలుంటాయి. వాటిని అయిదుగా చేసి దాన్ని కర్ణాటక సంగీతానికి అనువుగా తీర్చిదిద్దుకున్నారు. అలా మొదలైన అతడి ప్రయోగపూర్వక సంగీత సాధన తొమ్మిదేళ్ల వయసులో కృష్ణా జిల్లా గుడివాడలో తొలి కచేరితో మలుపు తిరిగింది. ఆ దశలో పెద్దల సలహా మేరకు చెన్నై చేరి ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నారు. మాండలిన్ వాయిద్యంలో దేశంలోనే కొత్త ఒరవడిని సృష్టించారు. ప్రముఖ సంగీత విద్వాంసులు మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి మహామహుల ప్రోత్సాహంతో చెన్నైలో స్థిరపడ్డారు. చెన్నై నుంచే తన సంగీత ప్రస్థానాన్ని దశదిశలా వ్యాపింపజేశారు. జుగల్బందీ, ఫ్యూజన్ వంటి ప్రక్రియల్లో ప్రపంచ కళాకారులతో కలిసి కచేరీలు చేశారు. కర్ణాటక, పాశ్చాత్య సంగీతాలను మిళితం చేసి ప్రయోగాలు చేయడంలో తనదైన ముద్ర వేసుకున్నారు. కర్ణాటక సంగీత ప్రపంచాన్ని విస్తృతం చేయాలనే సంకల్పంతో "శ్రీనివాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్" పేరిట సంగీత పాఠశాలను కూడా నిర్వహించారు. 1984లో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంజీ రామచంద్రన్ శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆస్థాన విద్వాంసుడిగా నియమించారు. అంత చిన్న వయసులో ఆ గౌరవం పొందిన మొదటి వ్యక్తి శ్రీనివాస్ కావడం విశేషం. కంచి కామకోటి మఠంలో "ఆస్థాన విద్వాన్" గా కూడా వ్యవహరించారు. 29 ఏళ్ల ప్రాయంలో 1998లో "పద్మశ్రీ" పురస్కారం వరించింది. "రాజా-లక్ష్మి", "నేషనల్ సిటిజన్స్", "రాజీవ్‌గాంధీ నేషనల్ ఇంటిగ్రేషన్", "సంగీతరత్న" వంటి పలు అవార్డులను కూడా సొంతం చేసుకున్నారు. శ్రీనివాస్‌కు 1994లో శ్రీతో వివాహమైంది. 2012లో వీరు విడాకులు తీసుకున్నారు. వారికి ఒక కుమారుడు కూడా ఉన్నారు. శ్రీనివాస్ సోదరుడు రాజేష్ కూడా మాండలిన్ వాద్య కళాకారుడిగా గుర్తింపు పొందారు.



**ప్రధాని, ముఖ్యమంత్రి సంతాపం :** సంగీత ప్రపంచానికి దీర్ఘకాల సేవలందించిన మాండలిన్ శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. తన ట్విట్టర్‌లో ఆయన స్పందించారు. శ్రీనివాస్ మృతి కర్ణాటక సంగీతానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. బాలమేధావిగా ప్రత్యేక గుర్తింపు పొందారని వివరించారు. తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, గవర్నర్ రోశయ్యలు కూడా సంతాపం ప్రకటించారు.

**మూగబోయిన సంగీత ప్రపంచం :** మాండలిన్ శ్రీనివాస్ ఇక లేరన్న వార్తతో సంగీత ప్రపంచం మూగబోయింది. గానకోకిల లతామంగేష్కర్, ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహ్మాన్, ఆస్కార్ బహుమతి పొందిన సాంకేతిక నిపుణుడు రసూల్ పోకుట్టి, తబలా విద్వాంసుడు జాకీర్‌హుస్సేన్, గాయకులు సోనూనిగమ్, శ్రేయఘోషల్, శంకర్‌మహదేవన్, శ్రీనివాస్, సుచిత్ర, రాహుల్ నంబియార్, కార్తిక్, సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తదితరులు సంతాపం ప్రకటించారు. ■

# అరుణ గ్రహానికి తొలి ప్రయోగం భారత్ ఘనవిజయం

గత ఏడాది నవంబరు ఐదున ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట నుంచి పీఎస్ఎల్‌వీ రాకెట్ ద్వారా వినువీధిలోకి ఎగిసిన మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్) తన లక్ష్యాన్ని విజయవంతంగా చేరుకుంది. 66.6 కోట్ల కి.మీ.ల ప్రయాణం అనంతరం మామ్ సెప్టెంబర్ 24 ఉదయం 7:41 సమయంలో అంగారకుడి కక్ష్యలోకి ప్రవేశించింది. బెంగళూరులోని ఇస్రో కమాండ్ సెంటర్‌లో నరాలు తెగే ఉత్కంఠతో ఈ ప్రస్థానాన్ని వీక్షిస్తున్న శాస్త్రవేత్తలు ఆనందంలో మునిగిపోయారు. ఈ మహత్తర సందర్భాన్ని అక్కడే ఉండి ప్రత్యక్షంగా వీక్షించిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా ఆనందం మిన్నంటింది.

**క్రమక్రమంగా కక్ష్యలోకి**

భారతీయ కాలమానం ప్రకారం ఉదయం 7.17 నుంచి 7.41 గంటల వరకూ 24 నిముషాల పాటు మామ్‌లోని 440 న్యూటన్‌ల సామర్థ్యం ఉన్న లిక్విడ్ అపోగి మోటార్‌లోని ఇంధనం మండింది. క్రమంగా దాని వేగం తగ్గిపోతూ వచ్చింది. ఇది అత్యంత కీలకమైన ప్రక్రియ. దీంట్లో ఏ చిన్నపొరపాటు జరిగినా ఇంత శ్రమా బూడిదలో పోసిన పన్నీరే. ఉపగ్రహంలో ఇస్రో శాస్త్రవేత్తలు ముందుగానే నిక్షిప్తం చేసిన కమాండ్లకు అనుగుణంగా ఇదంతా దానంతటదే (ఆటోమాటిక్‌గా) అత్యంత కచ్చితంగా జరిగిపోయింది. దీనివల్ల ఉపగ్రహం వేగం సెకనుకు 22.14 కి.మీ.ల నుంచి 4.4 కి.మీ.లకు తగ్గిపోయింది. చివరి నాలుగు నిమిషాల్లో మామ్ అంగారకుడి అవతలివైపునకు వెళ్లిపోవటంతో అది ఇస్రో శాస్త్రవేత్తలకు కనిపించలేదు. అయినప్పటికీ తన ప్రయాణాన్ని కచ్చితంగా కొనసాగించింది. అంగారక కక్ష్యలోకి ప్రవేశించింది.

**హాలీవుడ్ సినిమాకన్నా తక్కువ వ్యయం**

మామ్ (మంగళ్‌యాన్ అని కూడా పిలుస్తున్నారు) ప్రయోగానికి జరిగిన వ్యయం రూ.450 కోట్లు. అంగారక ప్రయోగాల కోసం ఇతర దేశాలు చేసిన ఖర్చుతో పోల్చితే ఇది చాలా తక్కువ. అంగారకుడిపైకి నాసా పంపించిన "మావెన్ మిషన్" కోసం అమెరికా చేసిన ఖర్చులో ఇది పదోవంతు. రోదసి పరిశోధనల నేపథ్యంలో హాలీవుడ్‌లో రూపొందిన "గ్రావిటీ" సినిమాకు ఇంతకంటే ఎక్కువే (దాదాపు రూ.600 కోట్లు) ఖర్చయింది. ఇప్పటివరకూ అమెరికా, రష్యా, యూరోపియన్ యూనియన్ మాత్రమే అరుణగ్రహంపైకి తమ ఉపగ్రహాలను పంపించగలిగాయి. అది కూడా అనేక ప్రయత్నాల తర్వాతే వాటికి ఆ విజయం దక్కింది. చైనా 2011లో "ఇంగ్‌హ్యూ-1" పేరుతో చేపట్టిన ప్రయోగం విఫలమైంది. అంతకుముందు 1998లో జపాన్



## మామ్ లక్ష్యాలు

- జీవం ఆవిర్భావానికి కీలక ఆధారమైన మీథేన్ అంగారకుడిపై ఉందా అని అన్వేషించటం.
- అరుణగ్రహంపై ఒకప్పుడు నీటి వనరులు పుష్కలంగా ఉండేవని ఇప్పటికే రుజువైంది. ఆ నీరంతా ఎలా మాయమైందో తెలుసుకోవటం.
- అంగారకుడి ఉపరితలాన్ని, అక్కడి మూలకాలను, ఖనిజాలను, వాతావరణాన్ని అధ్యయనం చేయటం.
- గ్రహాంతర అంతరిక్ష ప్రయోగాలను విజయవంతంగా చేపట్టటానికి అవసరమైన సాంకేతికను, ప్రణాళికలను అభివృద్ధిపరుచుకోవటం.

**ప్రయోగ విశిష్టతలు**

ఉపగ్రహం బరువు: 1,350 కిలోలు
పేలోడ్ బరువు : 15 కిలోలు:
రాకెట్: పీఎస్ఎల్‌వీ సీ 25

చేపట్టిన ఉపగ్రహ ప్రయోగం కూడా ఇంధనం అయిపోవటంతో విఫలయత్నంగా నిలిచింది. ఈ విధంగా అరుణగ్రహాన్ని చేరుకోవటానికి ఇప్పటివరకూ 51 ప్రయత్నాలు జరిగితే వాటిల్లో 21 మాత్రమే విజయం సాధించాయి. మొట్టమొదటి ప్రయత్నంలోనే మన శాస్త్రవేత్తలు సాధించిన విజయం.. అంతర్జాతీయ అంతరిక్ష రంగంలో భారత్ ప్రతిష్ఠను మరింత పెంచనుంది. అంగారకుడిని చేరుకున్న తొలి ఆసియా దేశంగా భారత్ నిలిచింది.





## పలురకాల పరిశోధనలు

1350 కిలోల బరువున్న మామ్ అంగారకుడి ఉపరితలాన్ని, అక్కడి ఖనిజ సంపదను, వాతావరణాన్ని అత్యంత సునిశిత కెమెరాలతో ఫొటోలు తీసి శాస్త్రవేత్తలకు అందజేస్తుంది. వీటిని అధ్యయనం చేయటం ద్వారా ఆ గ్రహం గురించి పరిశోధకులు తెలుసుకుంటారు. ముఖ్యంగా, జీవం ఉనికికి కీలకమైన మీథేన్ అంగారకుడిపై ఉందా అన్నది తేల్చటానికి ఈ పరిశోధనలు ఉపయోగపడనున్నాయి. అంగారకుడి కక్ష్యలో ఉన్న మామ్ నుంచి వెలువడిన తొలి సంకేతాలు భూమికి చేరటానికి 12 నిమిషాల 28 సెకన్ల సమయం పట్టింది. ఈ సంకేతాలను కాన్‌బెర్రాలో ఉన్న నాసా పరిశోధన కేంద్రాలు అందుకొని బెంగళూరులోని ఇస్రోకు వెంటనే పంపించాయి. అంగారకుడికి సంబంధించిన ఐదు చిత్రాల్ని మామ్ పంపించింది. ఇస్రో శాస్త్రవేత్తలు గురు, శుక్రవారాల్లో వాటిని విశ్లేషించి మీడియాకు విడుదల చేయనున్నారు. కక్ష్యలోకి ప్రవేశించిన మామ్ అండాకార మార్గంలో అంగారకుడి చుట్టు పరిభ్రమిస్తోంది. ఆ గ్రహానికి మామ్‌కు మధ్య కనిష్ఠ దూరం 423 కిలోమీటర్లు కాగా గరిష్ఠ దూరం 80,000 కిలోమీటర్లు.

## వెల్లువెత్తిన ఆనందం

మామ్ అంగారక గ్రహ కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించిన వెంటనే ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బందిలో ఆనందం వెల్లువెత్తింది. ప్రధాని మోడీతోపాటు వారందరూ కరతాళ ధ్వానాలతో తమ సంతోషాన్ని వ్యక్తీకరించారు. ఇస్రో ఛైర్మన్ రాధాకృష్ణన్‌ను మోడీ హృదయానికి గట్టిగా హత్తుకుని తన ఆనందాన్ని వ్యక్తీకరించారు. కమాండ్ రూములోని శాస్త్రవేత్తలు, ఇంజినీర్లలో ఏ ఒక్కరినీ వదలకుండా అందరిని కలుసుకుని అభినందనలు తెలిపారు. కోరిన వారికల్లా కాదనకుండా ఆటోగ్రాఫ్ ఇచ్చారు. ఇస్రో కమాండ్ సెంటర్‌లో మామ్ గమనాన్ని వీక్షించిన వారిలో కర్ణాటక గవర్నర్ వాజుబాయి వాలా, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేంద్రమంత్రులు అనంతకుమార్, సిద్ధేశ్వర్, సదానందగౌడ, శాస్త్రవేత్తలు యు.ఆర్.రావు, ఆచార్య యశ్‌పాల్ తదితరులున్నారు.

అంగారకుడిపై ఎన్ని పరిశోధనలు సాగించినా.. దాని చరిత్రపై ఇప్పటికీ స్పష్టత లేదు. అంగారకుడిపై ఒకప్పుడు భూమి తరహాలోనే పుష్కలంగా నీరు, ఉష్ణ వాతావరణం ఉండేదని పరిశోధనలు సూచిస్తున్నాయి. అలాగే వాతావరణం కూడా దట్టంగానే ఉండేదని అంచనాలున్నాయి. ఇవన్నీ ఏమయ్యాయి? ఆ గ్రహం ఇప్పుడు ఎందుకు నిర్జీవంగా, పొడిగా మారిందన్నది తేలాలి. అలాగే ఎక్కడైనా జీవం ఉందా అన్నది కూడా వెలుగులోకి రావాలి. ఖనిజాల విస్తృతిని తెలుసుకోవాలి. వీటన్నింటిపై మామ్ దృష్టిసారిస్తుంది. ■

# భారీ లక్ష్యాలకు స్ఫూర్తినిచ్చిన మార్స్ మిషన్ విజయం : జేపీ

భారత్‌కు ఉన్నకొద్దీ అవకాశాలు పరిమితమవుతూ సవాళ్లు పెరిగిపోతున్న తరుణంలో మార్స్ ఆర్బిటర్ మిషన్ (మామ్) భారీ లక్ష్యాన్ని ఛేదించటం దేశ ప్రజలందరిలో స్ఫూర్తిని నింపిందని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అమెరికాలో వ్యక్తిగత పర్యటనలో ఉన్న జేపీ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అంగారక గ్రహంపైకి పంపిన ఉపగ్రహ ప్రయోగాల విజయాల శాతం తక్కువగానే ఉన్నా, ఇతర దేశాల వైఫల్యాల నుంచి నేర్చుకుంటూ తక్కువ ఖర్చుతో మంగళయాన్‌ను మన శాస్త్రవేత్తలు విజయవంతం చేశారన్నారు. అంతరిక్షరంగంలో భారత్‌ని మరింత శక్తిమంతమైన దేశంగా చేసిన ఈ చిరస్మరణీయ విజయానికి కృషి చేసిన శాస్త్ర సాంకేతిక సిబ్బందికి జేపీ అభినందనలు తెలిపారు. భారతదేశ పునరుజ్జీవనానికి కావలసిన ఆర్థిక, రాజకీయ, పాలనాసంస్కరణలను సాధించుకోవటానికి కూడా ఇదే తరహాలో భారీ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దేశ ప్రజలంతా సమష్టిగా కష్టపడాలని జేపీ పిలుపునిచ్చారు.

మంగళయాన్ విజయం పట్ల లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు డి.వి.వి.యస్. వర్మ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బండారు రామ్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం ముందుకు దూసుకుపోతుంటే, తెలుగునాట రాజకీయం మాత్రం వెనకపట్టు పడుతోందని అన్నారు. వాస్తు పేరుతో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు వృధా చేస్తున్నారని, అధికార వికేంద్రీకరణ, అందరికీ నాణ్యమైన విద్య, పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సమన్వయం చేయటం వంటి ఆధునిక రాజకీయం చేయకుండా ప్రజలను ప్రలోభపెట్టే సంకుచిత మూఢ విశ్వాసాల రాజకీయాన్ని చేస్తున్నారని వారు అన్నారు. ■

---

# మద్యం బాధిత వితంతువులకు విధిగా ప్రత్యేక పెన్షన్

## మహిళాసత్తా రాష్ట్ర నాయకుల డిమాండ్

గుంటూరు నగరం, పరిసర ప్రాంతాలలో తాము వారం రోజులుగా తాము చేసిన అధ్యయనంలో మద్యం బాధిత వితంతువులు వందల సంఖ్యలో వున్నట్లు వెల్లడైందని రాష్ట్ర మహిళాసత్తా నాయకులు గడ్డిపాటి పద్మారాణి, యస్.మనోరమ, డి. దుర్గాదేవి ఒక ప్రకటనలో తెలియజేశారు.

నగరంలో మద్యానికి బానిసలై మితిమీరిన తాగుడుతో చిన్న వయసులోనే భర్తలను కోల్పోయిన ఈ వితంతువుల జీవితాలు విషాదగాథలుగా వున్నాయని వారు పేర్కొన్నారు. ఒక పక్క చిన్న పిల్లలతో సంసారాన్ని లాగలేకపోతున్న వీరిపట్ల ప్రభుత్వం కనీస కనికరం కూడా చూపడం లేదని, అందరికీ ఇచ్చే వితంతు పెన్షన్లు కూడా వీరికి అందడం లేదని తమ సర్వేలో తేలిందని వారు పేర్కొన్నారు.

తామ బృందం చొరవ తీసుకుని గత వారం రోజులుగా నగరంలో పదహారు కాలనీలను సందర్శించగా అక్కడికక్కడే 371 మంది మద్యం బానిస వితంతువులు తమను కలిసి తమ గోడు వెళ్ళబుచ్చుకున్నారు. వారిలో అన్ని సర్టిఫికెట్లు వున్న 60 మందితో అక్కడికక్కడే పెన్షను దరఖాస్తులు చేయించామని వారు తెలిపారు. కొన్ని అప్లికేషన్లను నేరుగా మున్సిపల్ కమీషనర్ కార్యాలయంలోనే బాధితులతో ఇప్పించామని అన్నారు.

రాష్ట్ర వ్యాపితంగా కొన్ని వేల మంది ఇలాంటి మద్యం బాధిత వితుంతువులున్నారని ప్రభుత్వం వెంటనే వీరికి ప్రత్యేక పెన్షన్ పథకాన్ని ప్రకటించాలని వారు కోరారు.

మద్యం బాధిత వితంతువులకు కనీసం 2000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని, వారి పిల్లలకు హాస్టలు వసతిగల విద్య అందించాలని, మద్యానికి బానిసలైన భర్తలకు ఉచితంగా డి-ఎడిక్షన్ సెంటర్లలో వైద్యం చేయించాలని మహిళాసత్తా నాయకులు డిమాండ్ చేశారు. ■

## ప్రజా ఉద్యమాలకు బాట

# లోక్‌సత్తా పార్టీ 8వ వార్షికోత్సవం

# లోక్‌సత్తా టైమ్స్ ప్రత్యేక సంచిక

గాంధీ జయంతిని, లోక్‌సత్తా పార్టీ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబరు 16–31 లోక్‌సత్తా టైమ్స్‌ను ప్రత్యేక సంచికగా వెలువరిస్తున్నాం. రెండు రాష్ట్రాలలోని రాజకీయ పరిస్థితులపైన, కీలకమైన ప్రజా సమస్యలపైన నిర్వహించ తలపెట్టిన ప్రజా ఉద్యమాల బాటను ఈ ప్రత్యేక సంచిక ఆవిష్కరిస్తుంది. అవినీతి అంతం, మంచి ప్రమాణాల విద్య వైద్య సేవల కోసం ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం, కో–ఆపరేటివ్ సంస్థల విస్తరణ, కఠిన మద్య నియంత్రణ, రైతాంగ సమస్యలు ఇతర కీలక రంగాలపై గణాంకాలు, విశ్లేషణలతో కూడిన వ్యాసాల సంకలనంగా పది కాలాలపాటు అందరూ భద్రపరుచుకోదగిన ప్రత్యేక సంచికగా రూపొందిస్తున్నాం.

100–120 పేజీలతో వెలువడే ఈ ప్రత్యేక సంచికకు మీ మీ విద్య, వైద్య, వ్యాపార, పారిశ్రామిక సహకార సంస్థల ప్రకటనలు ఇచ్చి సహాయ సహకారాలను అందించాల్సిందిగా కోరుతున్నాం.

మీ ప్రకటనలు చెక్కులు, డ్రాఫ్టులు అక్టోబర్ 10వ తేదీలోగా ఈ క్రింది చిరునామాకు పంపండి.

## ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| బ్లాక్ & వైట్ | పూర్తి పేజీ | ₹ 5,000 |
| మల్టీకలర్ | పూర్తి పేజీ | ₹ 10,000 |
| ప్రత్యేక పేజీలు | | ₹ 25,000 |

పేజీ సైజు (7.5 × 10.5) Inches

### చిరునామా

**లోక్‌సత్తా టైమ్స్:**
407, Tulips Apartments 6-3-655,
Behind Civil Suppliers Office
Somajiguda, Hyderabad-500 082
Phone : 040-23310288, 23311816

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

*"లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com



గుంటూరులో మద్యం బాధిత కుటుంబాలను సర్వే చేస్తున్న మహిళాసత్తా నాయకులు



గుంటూరులో మద్యం బాధిత వితంతువులకు పెన్షన్ అప్లికేషన్లను నేరుగా
అధికారులకి ఇప్పిస్తున్న మహిళాసత్తా నాయకులు

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15 Published on October 1st, 2014




| Book-Post<br>PRINTED MATTER | To, |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad